9440662699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18

# రాజధాని వార్తలు

Voice of Voiceless

అమరావతి సంపుటి : 3 సంచిక 12, పేజీలు 4 రూ. 2/- ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక డిసెంబర్ సోమవారం 11- ఆదివారం 17, 2017

## గ్రామ పంచాయతీలకు నిధుల గ్రహణం




**రాజధాని వార్తలు, ప్రతినిధి- అమరావతి :** గ్రామ పంచాయితీల స్వయం పాలన, స్వయం సమృద్ధి–అధికారాల బదిలీ అనే అంశాలు అందమైన నినాదాలుగా మిగిలి పోయాయి. వర్గ కక్షలకు అతీతంగా పంచాయితీ ఎన్నికల్లో ఏకగ్రీవాలను ప్రోత్సహించడం శుభసూచకమే అయినా ప్రకటించిన నగదు బహుమతిని ఏళ్ల తరబడి ఇవ్వకపోవడం ఏక గ్రీవ ఎన్నిక స్ఫూర్తిని దెబ్బతీస్తోంది. రాష్ట్రం విడిపోక ముందు అంటే 2013 జూన్‌లో గ్రామ పంచాయితీ ఎన్నికలు జరిగాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించి 1,835 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు జరిగాయి.ప్రభుత్వం ప్రకటన మేరకు మేజర్ పంచాయితీలకు రూ.15 లక్షలు,మైనర్ పంచాయితీలకు రూ.7 లక్షల రూపాయలు నగదు బహుమతులు ఇవ్వాలి. అయితే రాష్ట్రంలో 5శాతం మేజర్ పంచాయతీలకు ఏకగ్రీవం కావడంతో వాటికి రావాల్సిన నగదు బహుమతులను ఇంతవరకు అందించలేదు. దీనికి తోడు కేంద్రం నుంచి వచ్చే పంచాయితీ గ్రాంటులను కూడా వెంటనే విడుదల చేయకుండా గ్రామ పంచాయితీలకు ఆర్థిక ఇబ్బందులు కలుగజేస్తుంది. మరీ విడ్డూరం ఏమిటంటే పంచాయితీ విద్యుత్ బిల్లులు అంటూ కొంత మేర నిధుల మళ్లింపుకు కూడా పూనుకుంటుంది. దీంతో మేజర్ గ్రామ పంచాయితీలు ఆర్థికంగా నలిగిపోతున్నాయి. గ్రామ పంచాయితీల సర్పంచ్‌లకు చెక్ పవర్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆదాయవనరు విషయంలో సరైన దిశానిర్దేశం చేయకపోవటం తో గ్రామ పంచాయితీలు సమస్యల వలయంలో చిక్కుకుపోతున్నాయి. ఆదాయం విషయం అధికారులు చూసు కుంటారు. ఖర్చుల విషయం మనం చూసుకుంటే సరిపోతుందని అధిక శాతం సర్పంచ్‌లు భావించడం వల్ల రోజు రోజుకి పంచాయితీల ఆదాయం దిగజారిపోతుంది.

సర్పంచ్‌ల్లో 50 శాతం మంది పాత్ర నామమాత్రమేన్నది చేదు వాస్తవం. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్ల కారణంగా ఆసంఖ్య 70 శాతానికి పెరిగిందని అంచనా. మన సర్పంచ్‌ల వ్యవస్థ గ్రామ పంచాయితీల ఆదాయ వనరులను ఏమాత్రం మెరుగు పర్చేదిగా లేదు. సర్పంచ్‌లు ఒక ఉద్రేక పూరిత వాతావరణంలో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన వారిగానే మిగిలిపోతున్నారు. నెగ్గటం ద్వారా తమ కుల, వంశ, గౌరవం లేదా తను నమ్మిన పార్టీ గౌరవం నిలబెట్టామా లేదా అన్నదే ప్రధాన అంశంగా మిగిలిపోతుంది. ప్రమాణ స్వీకారం నాటికే వారి స్వయం ప్రతిభ బయట పడిపోయింది. మన రాష్ట్రంలో సర్పంచ్‌ల అధికారాలు నామమాత్రంగా ఉంటాయి. నిజం చెప్పాలంటే వారు సోంత నిర్ణయం తీసుకుని ఏ రోడ్డుగోతుని తట్టమట్టి వేయించి పూడ్పించలేరు. అధికార గణం పుణ్యమా అంటూ సర్పంచ్‌ల్లో 80 శాతానికి పైగా నామమాత్రపు ఏలికలే. వారు ప్రదర్శించేది మేకపోతు గాంభీర్యమే. అంతే కాని పరిపాలనపై పట్టు దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేయడం లేదు. మన సర్పంచ్‌లు గ్రామ పంచాయితీ కార్యదర్శి, పంచాయితీ విస్తరణాధికారి, డివిజనల్ పంచాయితీ అధికారుల చేతుల్లో కీలుబొమ్మలమని చెప్పవచ్చు దీనికి తోడు సంవత్సరానికి ఒకరోజు జరిగే పంచాయితీ అకౌంట్స్ ఆడిట్ సమయంలో జిల్లా ఆడిట్ విభాగం వారు సర్పంచ్‌లను ఏకంగా పరుగులు పెట్టించి ఉక్కిరి బిక్కిరి భయాందోళనకు గురి చేస్తారు. గ్రామంలో అభివృద్ధి పనుల విషయంలో సర్పంచ్‌ల పాత్ర అంతంతమాత్రం కావడంతో ఈ విషయంలో స్థానిక కాంట్రాక్టర్‌లు, నాయకలు చక్రం తిప్పుతుంటారు.

ఇక గ్రామ పంచాయితీ నిదుల ఖర్చంటే విద్యుత్ సామగ్రి కొనుగోలు లేదా శానిటేషన్ సామగ్రి కొనుగోలు గా మారిపోయింది. గ్రామ పంచాయితీల నిధుల్లో 70 శాతం ఖర్చు ఈ రెండింటికే పరిమితమైపోయింది. ఇవే కొందరి సర్పంచ్‌ల ప్రధాన ఆదాయ వనరుగా కూడా మారాయి.

చిత్రమేమిటంటే ఈ రెండు అంశాల విషయంలోనే ఎక్కువ మంది చెక్‌పవర్ల రద్దుకు సస్పెన్షన్‌కు గురవుతున్నారు. పదవి కోసం తిరిగి జిల్లా పంచాయతీ

- మిగతా 2 లో

## పోలవరం నిర్మాణంలో ప్రతిరూపాయికి లెక్కుంది



- 11న సీఎం చంద్రబాబు పర్యటన
- 22న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాక
- జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమ

**రాజధాని వార్తలు, ప్రతినిధి- అమరావతి :** మూడేళ్లలో పోలవరం ప్రాజెక్టుకు రూ.7,435 కోట్లు ఖర్చు చేయగా, కేంద్రం రూ.4,647 కోట్లు నిధులు ఇచ్చిందని, మరో రూ.2,884 కోట్లు ఇవ్వాల్సి ఉందని రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు 7.50 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి పని, 4.38కోట్ల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని పూర్తి చేశామన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఖర్చుపెట్టిన ప్రతీ రూపాయికి ఆన్‌లైన్‌లో వివరాలు ఉన్నాయని, ఎవరైనా చూడవచ్చన్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రాంతం వద్ద క్యాంపు కార్యాలయంలో నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌తో కలిసి ఆర్అండ్ఆర్‌పై రెండు జిల్లాల కలెక్టర్లు, జిల్లా యంత్రాంగంతో సుదీర్ఘంగా చర్చించారు. పునరావాస గ్రామాల్లో ఎంత మేర ప్యాకేజీ అమలు చేశారనే విషయాలను సీఎస్ ప్రశ్నించారు. దాంతో రాజమహేంద్రవరం భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ శ్రీరామచంద్రమూర్తి తెలియజేయబోయారు. సీఎస్ అడ్డుకుని సంబంధిత విభాగాల అధికారులే వివరాలు తెలియజేయాలన్నారు.

ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణలో 4 ఈఈలు, 13 మంది డీఈలు, 36 మంది ఏఈలు విధులు నిర్వహిస్తున్నారని వీరంతా ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా తెలియజేయాలన్నారు. రికార్డులతో ఉండి ఎందుకు చెప్పలేకపోతున్నారన్నారు. మొత్తం మూడు యూనిట్లుగా సాగుతోందని, తూర్పు గోదావరిలో దేవీపట్నం, ఎటపాక, కూనవరం మండలాలు 41వ కాంటూరులో ఉన్నాయని ఎస్‌డీసీ శ్రీరామచంద్రమూర్తి తెలియజేశారు. అనంతరం మంత్రి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పునరావాసంలో పశ్చిమ గోదావరి జిల్లాలో ఇప్పటి వరకు 680 బిల్లులకు 2380.76 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాలో 158 బిల్లులకు 153.44 కోట్లు కలిపి మొత్తం రూ.2,544.13 కోట్లు చెల్లించామన్నారు. ప్యాకేజీ నగదు ఆయా రైతుల ఖాతాల్లోనే జమ చేశామని, ఎక్కడా అవినీతి జరిగే అవకాశం లేదన్నారు. పోలవరం లెక్కలను స్పష్టంగా చెప్పామన్నారు. ప్రతి విషయానికి స్పష్టంగా లెక్కలు ఆన్‌లైన్‌లో ఉన్నాయన్నారు. ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

### కలెక్టర్లు ఎంతో కష్టపడ్డారు : మంత్రి ఉమ

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించే విషయంలో ఉభయ గోదావరి జిల్లాల కలెక్టర్‌లు కార్తీకేయ మిత్రా, కాటమనేని భాస్కర్ ఎంతో పారదర్శకంగా వ్యవహరించారన్నారు. ఎక్కడా అవినీతికి చోటు లేకుండా ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం వారి ఖాతాల్లోనే జమ చేయడం అభినందనీయమన్నారు.

### ఇంజనీర్లను భర్తీ చేస్తాం – సీఎస్

పోలవరం ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న ఇంజనీర్ల పోస్టులను 3 రోజుల్లో భర్తీ చేస్తామని రాష్ట్ర నీటి పారుదల శాఖముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ అన్నారు. భూసేకరణ, ఆర్అండ్ఆర్ అమలులో ఉన్న జంగారెడ్డిగూడెం డివిజన్‌లో ఉన్న ఈఈ పోస్టును వెంటనే భర్తీ చేస్తామని వెల్లడించారు

### 11న పోలవరానికి సీఎం రాక

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 11న పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు. విజయవాడ నుంచి ఉదయం 11.30 గంటలకు పోలవరం చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తారు. అనంతరం అధికార యంత్రాంగంతో సమీక్ష నిర్వహిస్తారు. ప్రాజెక్టు పనులు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీతో సహా అన్నింటిపైనా ఆయన సుదీరంగా సమీక్ష నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు పోలవరం నుంచి బయలుదేరి విజయవాడ వెళ్తారు.

### 22న కేంద్ర మంత్రి గడ్కరీ రాక

పోలవరం ప్రాజెక్టుపై వివాదాలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర జల వనరుల

- మిగతా 3 లో

## బహిష్కృత మణిశంకర్ అయ్యర్ సేవలు





**రాజధాని వార్తలు డెస్క్ :** మణిశంకర్ అయ్యర్ కాంగ్రెస్ నుంచి బహిష్కృతుడైనా ఆయన సేవలను కాంగ్రెస్ ఎప్పటికీ మర్చిపోరాదు. 1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం ఆపధర్మ ప్రధానిగా రాజీవ్‌గాంధీ ప్రమాణ స్వీకారం చేసినప్పటికీ ఆయన వెంటనే దేశవ్యాప్తంగా ఎన్నికలకు పిలుపునిచ్చారు. ఆ సమయంలో జర్నలిస్టు, వ్యాసకర్త, ఉన్నత విద్యావంతుడు.ఆర్థిక వేత్తకూడా.. విదేశీవ్యవహారాల శాఖలో సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. అంతకంటే మించి డూన్ స్కూల్లోను, కేంబ్రిడ్జి యూనివర్సిటీలోనూ రాజీవ్‌గాంధీకి ఆయన జూనియర్‌గా ఉన్నారు. డూన్‌స్కూలు ఆధ్వర్యంలో నడిచే వారపత్రికలో ఆయన ఎడిటర్‌గా పనిచేశారు. **1984 ఎన్నికల్లో రోజువారి అన్ని పేపర్లలోనూ ప్రత్యేకమైన ప్రకటనలు దేశవ్యాప్తంగా అన్ని పత్రికల్లోనూ ఆయా భాషల్లో ప్రచురించబడేవి. అవి చాలా తీక్షణంగాను, హృదయానికి హత్తుకునే విధంగా ఉండేవి. పాములు తన పిల్లలను అవే తింటాయి. అలాగే భారత దేశీయులనబడే వారు స్వదేశీయులనే మింగివేస్తారనే అర్థంతో అవి ప్రచురిస్తూ, ఎన్నిక విషయంలో ఓటర్లు అప్రమత్తంగా ఉండాలనే ప్రకటనలు ప్రవేశపెట్టారు. ఇలాంటివి చాలా ఉండేవి. అవన్నీ దేశభక్తికి, ఓటర్లు ఎవరిని ఎంచుకోవాలి అనే విషయంపై ఉండేవి.** రాజీవ్‌గాంధీ అప్పటి ఎన్నికల్లో 533పార్లమెంటు స్థానాలకు 404 కైవసం చేసుకోవడంలో ఈ ప్రకటనల ప్రభావం ఉంది. పేపరు ప్రకటనల ద్వారా ఆయన వెలుగులోకి వచ్చినప్పటికీ ఆయన రచించిన అనేక రాజకీయ వ్యాసాలు కూడా ప్రాచుర్యం పొందాయి. 1989 రాజకీయాలు,మీడియాకు పాలసీ మేకర్‌గాఉన్నారు. కాంగ్రెస్‌కు అనేక శిక్షణా తరగతులను ఆయన నిర్వహించేవారు. క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్యం ఎలా ఉండాలన్నదానిపై ఆయన నిరంతరం తరగతులు నిర్వహించేవారు. ప్రధాని మోడీని ఆయన నీచే (నీచమైన వ్యక్తి) అని అందుకే ప్రప్రథమ ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ,ఇందిరాగాంధీలను బీజేపీ ప్రభుత్వం గుర్తించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దానిలో భాగంగానే గంధీనాలికా కీడా (మురికినీళ్లలో పురుగు),గాడిద, కోతి, వైరస్, యముడు,రేబీస్ బాధితుడు, భస్మాసురుడు, మృత్యుబేహారీ, లాంటి పదాలను ఆయన వాడారు. దీంతో నాజాతి అంతా నీచమైనదే అంటూ మోడీ నీచే పదాన్ని రాష్ట్రంలోని ఆయన సామాజిక వర్గాన్నంతటికీ అంటగట్టడంతో , గుజరాత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్న కాంగ్రెస్ అధ్యక్ష,ఉపాధ్యక్షులు ఆయనకు షోకాజ్‌నోటీసులు,పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించారు. అయితే గురువారం మణిశంకర్‌ఈ వ్యాఖ్యలపై క్షమాపణ కోరిన విషయం తెలిసిందే.

ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన అంశం ఏమంటే ఇదే మోడీ 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతాయుత పదవిలో ఉండి, మహిళ అనికూడా చూడకుండా సోనియాను నానా విధాలుగా అవమాన పరిచారు. సోనియా ఇక్కడ పిల్లలను కనలేదు కాబట్టి అంటూ రాహుల్,ప్రింయాక పుట్టుకపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమె నా ఇంట్లో పనిమనిషిగా కూడా ఉండటానికి అర్హతలేని వ్యక్తి అంటూ దూషించారు. దీంతో అప్పటి ఎన్‌డీఏ ప్రభుత్వంలోని ప్రధాని వాజ్‌పేయి ఇతరులు ఆయనను

- మిగతా 3లో

జనవరి నుంచి పంచదార పంపిణీ 2లో

బిట్‌కాయిన్ కథా కమీషు 3లో

నేవీ సేవలు భేష్ 4లో




## ఈవీఎంలకు బ్లూటూత్

ఎన్నికల సంఘం దర్యాప్తు...



**న్యూఢిల్లీ :** గుజరాత్ పోలింగ్‌లో బీజేపీ టాంపరింగ్ చేస్తోందన్న కాంగ్రెస్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. పోర్ బందర్‌లోని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లకు జిల్లా కలెక్టర్‌ను, ఎన్నికల సంఘం అధికారులను, ఇంజినీర్లను పంపించింది. ఈవీఎంలకు వై ఫై కనెక్ట్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై దర్యాప్తుకు ఆదేశించింది. ఈవీఎంలకు బ్లూటూత్‌ను కనెక్ట్ చేయడం సాధ్యం కాదని, తమ అధికారుల ఎదుట దీనిని ఎలా కనెక్ట్ చేశారో వివరించాలని, ప్రత్యక్షంగా చూపించాలని ఫిర్యాదుదారును ఆదేశించింది. ఈ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ట్యాంపరింగ్ చేశారని కాంగ్రెస్ పార్టీ నేత అర్జున్

- మిగతా 2లో



## రాజధాని వార్తలు
కలం

# అనబోయి... అనిపించుకోవడం..

**తన ప్రేమలోనూ, ద్వేషంలోనూ స్పష్టంగా లేనివాడు**
**తన కాలాన్ని ప్రభావితం చేయలేడు : అంబేద్కర్**

ఇది సినీ హీరో పవన్‌కు సరిగ్గా సరిపోతుంది. ఎన్నికల ముందు ఆయన అవినీతి ప్రభుత్వాలకు కాదు మంచి అనుభవం ఉన్న పార్టీలకు ఇవ్వండని కాలికి బలపం కట్టుకొని మరీ తిరిగారు. అంతేకాదు ఏదైనా లోపాలుంటే ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోనని స్పష్టం చేశారు. మూడున్నరేళ్లలో ఒక్కసారి కూడా నిలదీసిన పాపాన పోలేదు. ఎంత పటిష్టమైన ప్రభుత్వమైన లోటుపాట్లు సహజం అలాంటప్పుడు నిలదీసి తన కర్తవ్యాన్ని చాటుకోవాలి. అయితే అందుకు భిన్నంగా ప్రతిపక్షపార్టీపై విమర్శలు చేయడం హాస్యాస్పదం. ఆయన ఏదో అక్కసును వ్యక్తం చేసుకుంటానికి షూటింగ్ విరామంలో వచ్చారేగాని సమాజంపైనా ఏమాత్రం బాధ్యతగా వ్యవహరించడంలేదని, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కేసారని ప్రజలకు స్పష్టం అయిపోయింది. నిన్నటివరకు ప్రత్యేక హోదా కోసం మాట్లాడిన ఆయన ప్రస్తుతం దాన్నించు తప్పుకుపోవడం యువతలో ఆయన పట్ల విముఖత పెరిగేట్లు చేసింది. అంతేకాదు ఇంతవరకు యువతకు ఉద్యోగాల కల్పన లేకుండా, రాజధాని ప్రాంతంలో దాదాపు 33 వేల ఎకరాల్లో వ్యవసాయం లేక చిన్న, సన్నకారు రైతులు, రైతుకూలీలు నానా అగచాట్లకు గురవుతుంటే వారి గురించి ఒక్క ప్రశ్న వేసిన పాపాన పోలేదు. అధికారపక్ష పార్టీ ఫిరాయింపులపై కూడా ఒక్క మాట మాట్లాడలేదు. ఇదేనా ప్రశ్నిస్తానంటే అని ఆయన నమ్మి ఓట్లేసిన వారంతా బాధపడుతున్నారు. బాబువస్తే జాబు వస్తుందని భావించిన యువత ఆయన కుమారుడిని మాత్రమే ఉద్యోగస్తుడిని చేసుకున్నారని తీవ్ర విమర్శలు చేస్తుంటే ఆయన మొహమాటంగా లోకేష్‌పై వ్యాఖ్యలు చేయడం జనాగ్రహానికి కారణమవుతోంది.

ముఖ్యమంత్రి కుమారుడు కాబట్టి మళ్లీ ముఖ్యమంత్రి కావాలనుకోవడం సరికాదని చెప్పడంతో, ఆయన మెగాస్టార్ తమ్ముడిగా కాకపోతే సినిమాల్లోకి వచ్చేవాడా అని ప్రతిపక్షం దుమ్మెత్తి పోస్తోంది. అలా ఇతరులను విమర్శించబోయి, ఆయనే అనేక విమర్శల పాలవుతన్నారు. ఆయన చెప్పేది అనుభవం గురించి .. గాంధీ మహాత్ముడికి కూడా సత్యాగ్రహం మొదలుపెట్టక ముందు అటువంటి అనుభవం లేదని తెలుసుకోవాలి. ఏదో రెండు శ్రీశ్రీ కవితలు, చెగోవీర అభిమానిని, వామపక్షాల భావలు అని చెప్పుకోవడం తప్పితే ఆయనలో నిజమైన కార్యశీలత, కార్యాచరణ ఏమీ లేదనేది ప్రస్తుతం అందరికీ తెలిసిపోయింది. సినిమాల్లో ఒకరు కథరాస్తారు, మరొకరు డైలాగులు రాస్తారు. అవి ఎలా పలకాలో దర్శకుడు వివరిస్తారు. దాన్ని బట్టి సదరు నటులు నటిస్తారు, హాలంతా చప్పట్లతో మారుమ్రోగుతుంది. ఇంతమంది కష్టాన్ని తెరపై నటుడు కొట్టేస్తాడు. సమాజం పట్ల బాధ్యత గల నటులు ఒక్కరు కూడా లేకపోవడం రాష్ట్ర ప్రజల దురదృష్టం.

వైసీపీ అధినేతపై కేసులున్నందున చంద్రబాబుకు మద్దతిస్తున్నా అన్నారు. అయితే ఓటుకు నోటుకేసుతో సహా ఆయనమీద కూడా చాలా కేసులున్నాయి. ఒక్క వోటుకు నోటు కేసు మినహా అన్ని కేసుల్లో ఆయన స్టే తెచ్చుకున్నారు. వచ్చే నెల్లో సుప్రీంకోర్టు ఓటుకు నోటు విచారణ ప్రారంభించే అవకాశం ఉంది. అంటే రాష్ట్రంలో ప్రధాన రాజకీయపార్టీలు దొందూ దొందే అన్నమాట. ఒక మంచి పార్టీ వస్తుందేమో నని జనసేనవైపు చూసిన ప్రజలకు, తెలుగుదేశం పార్టీకే మద్దతు ఇచ్చి పవన్‌కల్యాణ్ వారికి పెద్ద షాక్ ఇచ్చారు. ఎప్పుడో స్టేజ్‌పై తనపెద్దన్న చిరంజీవిని పరకాల ప్రభాకర్ విమర్శించడాన్ని ఇన్నేళ్లకు ఆయన గుర్తు తెచ్చుకోవడం దొంగలు పడిన ఆర్నెల్లకు ...సామెత గుర్తు చేస్తుంది. దీన్ని సాకుగా తీసుకొని రక్షణమంత్రి నిర్మలా సీతారామన్‌ను విమర్శించడం అనవసర రాద్ధాంతం తప్ప ఇంకేం లేదు.

పవన్ కల్యాణ్ ఏక పక్ష నిర్ణయాలు తప్పితే ప్రజలకు చేస్తున్నదేమీలేదు. ఆయనపై ఆశలుపెట్టుకున్నవాళ్లంతా ఊసూరంటున్నారు.

కళ్లూ, చెవులూ ఉండి కూడా మీడియా కోడై కూస్తున్నా.. గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా రాజధాని నిర్మాణంపై కూడా ఆయన స్పందించలేదు. నేనొక రైతును ఫాంహవుస్ ఉందని చెప్పుకోవడమే కాని ఈ మూడున్నరేళ్లలో ఆయన రైతుల కోసం మాట్లాడింది ఒక్కటీ లేదు. నటుడి మేకప్ చెరిగిపోతే ఎలా ఉంటుందో.. పవన్ ఉత్తుత్తి ప్రసంగాలు కూడా అలాగే ఉన్నాయి. ఆయన నిజరూపం బయటపడుతోంది. ఆయనవి కాలక్షేపం రాజకీయాలని ప్రజలు తెలుసుకుంటున్నారు. పోలవరం ప్రాజెక్టును దర్శించిన అతనికి అధికారులు అఘమేఘాలపై హారతులివ్వడం చూసిన ప్రజలు ఆయన నిర్వాకాలపై నిలదీసి తమరి హడావుడి టూర్లకు ప్యాకేజీ ఎంతని ప్రశ్నించే రోజు త్వరలో ఉందని గుర్తిస్తే మంచిది.

# జనవరి నుంచి పంచదార పంపిణీ

- 12 నుంచి విలేజ్ మాల్స్ ప్రారంభం
- ప్రారంభోత్సవానికి ముఖేష్ అంబానీ రాక
- ఈ పాస్‌తో రూ..1.500 కోట్లు ఆదా
- పీడీఎస్ సంస్కరణల జాతీయ సదస్సులో మంత్రి పుల్లారావు

**రాజధాని వార్తలు, ప్రతినిధి- అమరావతి :** వచ్చే ఏడాది సంక్రాంతి నుంచి రేషన్ డిపోల్లో పంచదార పంపిణీని పునరుద్ధరించనున్నట్లు పౌరసరఫరాలు, సివిల్ సప్లయిస్‌శాఖ మంత్రి పీ పుల్లారావు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పంచదార సరఫరాను నిలిపివేయటంతో తెల్లరంగు రేషన్ కార్డుదారులకు కొద్ది నెలలుగా పంచదార పంపిణీని నిలిపివేశామన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సీఎం చంద్రబాబు మాట్లాడటంతో సంక్రాంతిని పురస్కరించుకుని పంచదార పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే చంద్రన్న విలేజ్ మాల్స్‌ను ఈనెల 12న రిలయన్స్ చైర్మన్ ముఖేష్ అంబానీ, సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) సంస్కరణపై రెండు రోజుల జాతీయ సదస్సు విజయవాడలోని ఒక హోటల్‌లో సోమవారం ప్రారంభమైంది. 23 రాష్ట్రాల పౌరసరఫరాలశాఖ కార్యదర్శులు పాల్గొన్న ఈ సదస్సులో రాష్ట్రంలో పీడీఎస్ పనితీరు, ఈ పాస్ తదితర అంశాలపై చర్చించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పుల్లారావు మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ సమయంలో కార్డుదారులకు పంచదారను పంపిణీ చేయనుండటంపై హర్షం వ్యక్తం చేశారు. విలేజ్ మాల్స్‌ను తొలుత రాజస్థాన్ ప్రవేశపెట్టగా, ఇపుడు రాష్ట్రంలోనూ ప్రారంభంకానున్నట్లు చెప్పారు. చంద్రన్న విలేజ్ మాల్స్ ఏర్పాటుకు 10 జిల్లాల్లో రిలయన్స్‌తో, మరో మూడు జిల్లాల్లో ఫ్యూచర్ కంపెనీలో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ స్టోర్ట్స్‌లో 20 శాతం తగ్గింపు ధరలతో నిత్యావసర



వస్తువులను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పీడీఎస్ బియ్యం తీసుకోని కార్డుదారులకు చిరు ధాన్యాలను అందజేస్తామని తెలిపారు. వీటి నిర్వహణకు డీలర్లకే అప్పగిస్తామని, ఫలితంగా వారి ఆదాయం పెరుగుతుందన్నారు. పీడీఎస్‌లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రేషన్ పంపిణీకి ఈ పోస్ వ్యవస్థను అమలు చేయటం నిత్యావసర వస్తువుల బ్లాక్ మార్కెటింగ్‌కు అరికట్టామని, దీనివల్ల రూ.1,500 కోట్లను ఆదా చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.169 కోట్లను ఖర్చు చేసిందన్నారు. పీడీఎస్ సంస్కరణలు తెచ్చే క్రమంలోనే బీఘులకు రాష్ట్రాల విధానాలను అధ్యయనం చేస్తున్నట్లు పేర్కొన్నారు..

**87 శాతం సరుకుల పంపిణీ**

గత నెలలో పీడీఎస్ డిపోల ద్వారా 87శాతం నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు మంత్రి పుల్లారావు చెప్పారు. ఒక్కో జిల్లాలో రూ.6 కోట్ల నుంచి రూ.78 కోట్ల మేర ఆదా చేసుకుంటున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు రేషన్ సరుకులను సమర్థంగా అందజేసేందుకు ఆధార్ ఆధారిత విధానాన్ని కూడా అమలు చేస్తున్నట్లు చెప్పారు. నగదు రహిత లావాదేవీలు,పోర్టబులిటీ విధానంలో రాష్ట్రంలో ఎక్కడున్నా రేషన్ పొందే సౌలభ్యాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ పొందటంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వీఆర్ఓ పీడీఎస్ డిప్యూటీ తహసిల్దార్,ఏఎస్ఓ ఆమోదంతో సరుకులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్రంలో రేషన్ సరుకుల పంపిణీపై పౌరసరఫరాలశాఖ ముఖ్య కార్యదర్శి బీ రాజశేఖర్,డైరెక్టర్ జీ రవిబాబు, టెక్నికల్ డైరెక్టర్‌గురుప్రసాద్, ఆధార్ అనేబుల్ విధానంపై బాలాజీ తదితరులు ఇతర రాష్ట్రాలకార్యదర్శులకు వివరించారు. జార్ఖండర్‌లో అమలు చేస్తున్న ఆటోమెషిన్ పైలెట్ ప్రాజెక్టుపై ఆ రాష్ట్ర ప్రతినిధి, ఏపీ, రాజస్థాన్, జార్ఖండ్ ఒడిషా డేటా ఎనాలసిస్‌పై అంకిత్ సూద్, ఏపీ గుజరాత్, రాజస్థాన్ విధానాలపై కుమరన్ వివరించారు. ఇదిలా వుండగా, సదస్సులో రెండో రోజైన మంగళవారం 23 రాష్ట్రాల కార్యదర్శులు నాలుగు గ్రూపులుగా విజయవాడ, పరిసర గ్రామాల్లోని రేషన్ డిపోలలో అమలవుతున్న విధానాలను పరిశీలించనున్నారు.

### విలేజ్ మాల్స్‌ను అడ్డుకుంటాం

**రాజధాని వార్తలు ప్రతినిధి, విజయవాడ :** కాకులను కొట్టి గ్రద్దలకు పెట్టిన చందంగా నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందించే రేషన్ షాపులను విలేజ్ మాల్స్ పేరుతో ప్రైవేటీకరించడాన్ని అడ్డుకుంటామని, విలేజ్ మాల్స్ ప్రారంభోత్సవానికి వచ్చే ముఖ్యమంత్రికి తమ నిరసన తెలుపుతామని సీ.పీ.ఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ తెలిపారు. సీ.పీ.ఐ 31వ డివిజన్ శాఖ 4 వ మహాసభ టేనర్‌పేట టిఎంహెచ్ స్కూల్‌లో నిర్వహించారు. సభలో ముఖ్యఅతిథిగా దోనేపూడి శంకర్ మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో అమ్మహస్తం. గృహమిత్ర తదితర పథకాల ద్వారా నిత్యావసర సరుకు లను సబ్సిడీ ధరలకే రేషన్ డిపోల ద్వారా ప్రభుత్వమే పేదలకందించేదన్నారు. దశాబ్దాల చరిత్ర కలిగి, రాష్ట్రంలో 3 కోట్ల మంది ప్రజానీకానికి చౌకధరతో రేషన్ అందిస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం విలేజ్ మాల్స్‌గా మార్చి రిలయన్స్, హెరిటేజ్ వంటి గుత్త సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు.రేషన్ షాపులను విలేజ్ మాల్స్‌గా మారుస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ఆక్షేపణీయమని, చౌక ధరల దుకాణాలను విలేజ్ మాల్స్‌గా మార్చడమంటే వాటిని ప్రైవేటీకరించి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం తప్ప మరొకటి కాదన్నారు.

# టీడీపీలో రాజ్యసభ టికెట్ల హడావుడి

**రాజధాని వార్తలు ప్రతినిధి,అమరావతి :** త్వరలో జరగనున్న రాజ్యసభస్థానాల ఎన్నికలలో అధికారపార్టీ టికెట్ల కోసపం ఆశావహుల జాబిత ఎక్కువగా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏప్రిల్ 2న ఆరుగురు రాజ్యసభ సభ్యులు రిటైర్ కానున్నారు. వారిలో ఏపీ నుండి కాంగ్రెస్ సభ్యులుగా ఉన్న చిరంజీవి, రేణుకా చౌదరి, టీడీపీ సభ్యుడు దేవేందర్ గౌడ్ తెలంగాణ నుండి ఏపీకి చెందిన టీడీపీ సభ్యుడు సీఎం. రమేష్ మరో ఇద్దరు సభ్యులు రిటైర్ కానున్నారు. ఏపీ నుండి ఖాళీ అవుతున్న మూడు స్థానాలకు ఫిబ్రవరిలో. ఎన్నికలు జరగనున్నాయి.

ఈ స్థానాల కోసం అధికార తెలుగుదేశం పార్టీలోఅప్పుడే పోటీ ప్రారంభమైంది. చంద్రబాబు క్యాబినెట్‌లో సీనియర్ మంత్రి అయిన యనమల రామకృష్ణుడు రాజ్యసభ టిక్కెట్ ఆశిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజ్యసభకు వెళ్లాలనుకుంటున్నట్లు చెప్పారు. 35 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న తాను పలు హోదాల్లో పనిచేశానని, అధిష్ఠానం అవకాశం ఇస్తే రాజ్యసభకు టికెట్ కేటాయిస్తే రాష్ట్రంలో మరోసారి కేబినెట్ విస్తరణ చేస్తారని అధికార పార్టీలో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం

**వైసీపీకి ఒక్కస్థానం దక్కేనా?**

శాసనసభలో మొత్తం 175 స్థానాలకు గాను టీడీపీకి 105 మంది సభ్యుల బలం ఉంది. ప్రతిపక్ష పార్టీ వైఎస్సాఆర్ కాంగ్రెస్ నుండి 22 మంది ఎమ్మెల్యేలు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం 131కి చేరుకుంది. మరి కొద్దిరోజుల్లో వైసీపీ నుండి మరి కొందరు ఎమ్మెల్యేలు చేరతారని ప్రచారం జరుగుతోంది. దీనికి తగ్గట్టుగానే వైసీపీలో నెంబర్ టూగా ఉన్న నాయకుడు తనతో టచ్‌లో ఉన్నారని రవాణా శాఖ మంత్రి అచ్చెనాయుడు బహిరండంగా ప్రకటించటం రాజకీయవర్గాల్లో కలకలం రేపింది. శాసనసభలో ప్రస్తుతం ఉన్న సంఖ్యాబలంతో రెండు రాజ్యసభ స్థానాలను టీడీపీ దక్కించుకుంటుంది. మరో నలుగురు ఆ పార్టీలో చేరితే మూడవ రాజ్యసభ స్థానం కూడా టీడీపీకే దక్కుతుంది. ఈ వ్యూహంతోనే టీడీపీ సీనియర్లు రాజకీయ వ్యూహంతో పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. యనమల రామకృష్ణుడుతో పాటు ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు సీఎం. రమేష్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా పనిచేసిన కంభంపాటి రామమోహన్‌రావు, కావలి మాజీ ఎమ్మెల్యే బీదా మస్తాన్‌రావు, మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకరరావుతో పాటు తెలంగాణకు చెందిన టీడీపీ నేతలు మోత్కుపల్లి నరసింహులు, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు రాజసభ్య టిక్కెట్ ఆశిస్తున్నవారిలో ఉన్నారు. మోత్కుపల్లికి గవర్నర్ పదవి ఇప్పించేందుకు చంద్రబాబు కేంద్రంపై ఎంత ఒత్తిడి తెచ్చానా ఆయనకు ఆ పదవి దక్కలేదు. వైసీపీ నుండి మరో నలుగురు శాసనసభ్యులు టీడీపీలో చేరితే మూడు స్థానాల్లో ఒకటి తెలంగాణకు కేటాయించి మోత్కుపల్లి నర్సింహులుకు టికెట్ ఇస్తారని, మిగిలిన రెండు స్థానాల్లో యనమల రామకృష్ణుడు, సిట్టింగ్ ఎంపీ సీఎం. రేమేష్‌కు కేటాయిస్తారని అధికార పార్టీలో చర్చసాగుతోంది. రెండు స్థానాలో దక్కే పక్షంలో తెలంగాణకు టికెట్ లేనట్లేనని ఆ పార్టీ సీనియర్లు చెబుతున్నారు.

**వైసీపీ అభ్యర్థిగా అయోధ్య?**

ప్రస్తుతం శాసనసభలో వైసీపీ బలం 44. ఇదే బలం కొనసాగితే వైసీపీకి ఒక్కస్థానం దక్కుతుంది. ఆ స్థానంలో రాజ్యసభ అభ్యర్థిగా రాంకీ గ్రూప్ చైర్మన్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డిని నిలపాలన్న యోచనలో వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. ఉన్న సభ్యుల్లో మరో నలుగురు జారితే రాజ్యసభ స్థానానికి వైసీపీ ఈభ్యర్థిని నిలపకపోవచ్చు మొత్తం మీద రాజ్యసభ టికెట్ల కోసం అధికార పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది.

## ముస్లిం హక్కుల ప్రతినిధిపై దాడి

**ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు**

**విశాఖపట్నం :** వక్ఫ్‌బోర్డు ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ముస్లిం హక్కుల పోరాట సమితి ప్రతినిధి ఖాధర్ భాషా డిమాండ్ చేయడం దాడికి దారితీసింది. శుక్రవారం గాజువాకలో సున్ని జామామసీద్ పోరాట సభ్యుడు ఖాధర్ భాషాపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి తెగబడ్డారు. నిందుతులపై చర్యలు తీసుకోవాలని, పోరాటసమితి ప్రతినిధులు ఆస్మత్‌అలీ, ఎండీ సలీం, ఎండీ హబీబ్, జిలానీ, జైలాబుద్దీన్, ఎండీరంజాన్‌అలీ, సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. బాధితుడు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, అతిని ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారన్నారు. ముస్లిం హక్కుల పోరాట సమితి ప్రతినిధులు మీడియా సమావేశం 3వ రోజునే దాడికి దిగడం దారుణమని ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. జమా మసీదు కమిటి సభ్యులు కొంతమంది వక్ఫ్‌ఆస్తులు, నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ముస్లిం హక్కుల పోరాటసమితి ప్రతినిధులు ఆరోపణలు సంధించారు.

## ఈవీఎంలకు బ్లూటూత్

(మొదటిపేజీ తరువాయి)

మోధ్వాడియా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. పోర్‌బందర్‌లోని శారదా మందిర్‌లో బూత్ నంబర్లు 145, 146, 147లలోని ఈవీఎంలను బ్లూటూత్ సహాయంతో ఇతర పరికరాలకు అనుసంధానం చేశారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. పోర్‌బందర్ బీజేపీ అభ్యర్థి బాబు బొఖారియా ఇబ్బందుల్లో పడ్డారు. ఆయన మద్దతుదారులు బీజేపీ అనుకూల నినాదాలు చేయడంతో ప్రత్యర్థులు ఫిర్యాదు చేశారు. బాబు బొఖారియా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్లు ఆరోపించారు.

# నిధుల గ్రహణం

(మొదటిపేజీ తరువాయి)

అఫీసర్లను ప్రసన్నం పొంది అధికారం నిలుపుకుంటున్నారు. ఈ రాజకీయ-అధికార క్రీడలో పంచాయితీ అభివృద్దిని గాలికి వదులుతున్నారు. చాల మంది సర్పంచ్‌లకు అదాయ వనరులను పెంచుకోవడం ఎలా అనే విషపంపై అవగాహన లేదు. చివరకు ఇళ్లపన్ను,కుళాయిపన్నులు కూడా పూర్తి శాతం వసూలు చేయడం లేదు.

పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు మిల్లులు వారితో రాజీ పడి ఆస్తి పన్ను విషయంలో చూసీ చూడనట్లు వదిలేస్తున్న ఘటనలు లెక్కకు మించి ఉన్నాయి. విద్యావంతులైన యువత సర్పంచ్‌లుగా ఎన్నికై గ్రామ పంచాయితీల ఆదాయ వనరులు పెంచడానికి కృషి చేయాలి. పెద్దపెద్ద ఫ్యాక్టరీలు, సంస్థల్లో వన్నువసూళ్లకు వీరు భయపడటంతో ఆర్థిక స్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేకుండా పోయింది. చాలా గ్రామాల్లో వృత్తి పన్ను వసూలు జరగటం లేదు. తన గెలుపుకు సహకరించిన వర్గాల నుంచి ఏ విధంగా పన్ను వసూలు చేయగలమని సర్పంచ్‌లు ప్రశ్నిస్తూ గ్రామాల భవిష్యత్‌ను అంధకారం చేస్తున్నారు. సైకిళ్లపై వీధుల్లో వ్యాపారం చేసేవారు, పచ్చికబయళ్ల వేలం పాటలు, రోడ్ మార్జిన్, చెరువుగట్లపై ఉన్న ఫలవృక్షాలకు, చెరువుల వేలంపాటల విషయంలోనూ 80 శాతం అక్రమాలు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల బలమైన చేపల సంఘాలు ఉండటంతో సర్పంచ్‌లు ఒత్తిడికి గురవుతున్నారు.

పంచాయతీకి లక్ష కట్టే బదులు రూ. 10 వేలతో సర్పంచ్‌ను మేనేజ్‌చేయవచ్చుననే దృక్పథం పెరిగిపోయింది. మరోక ముఖ్యమైన విషయం గ్రామాలలోని కిరాణా షాపు ఎరువుల షాపులు, హోటళ్లు నుండి ఏ విధమైన పన్నులు ఎప్పుడూ వసూలు చేయటం లేదు. ఇటీవల కాలంలో పట్టణాలకు 30-40 కిలోమీటర్ల దూరంలోని గ్రామాలలో కూడా ఇళ్లస్థలాలకు లేఅవుట్‌లు వే స్తున్నారు. వాటికి సంబంధించి భూమి కన్వర్షన్ ఫీజుల వసూలు విషయంలో అక్రమాలు జరుగుతున్నాయి.

ఇటుక బట్టీలు, కృత్రిమ చెరువుల తవ్వకం,పాడి పరిశ్రమ పాల శీతలీకరణ కేంద్రాలు, ఆయల్ మిల్లులు, పప్పులు మిల్లులు, రైసు మిల్లులకు సంభందించి కూడా పన్నులు వసూళ్లు జరగటం లేదు. మేజర్‌పంచాయితీల్లోని సినిమా హోళ్లు ఐస్ క్రీం సెంటర్లు హోటళ్లు , పాన్‌షప్రులు మిక్చర్ బండ్లు తాకట్టు వ్యాపారుల నుండి, సెల్ టవర్‌లు వీడియోగేమ్స్‌సెంటర్ల నుండి ఇటుక బట్టీల నుండి కూడా పన్నులు వససలు చేయటం లేదు. నిర్ణీత పన్నులు వసూలు చేయని సర్పంచ్‌లను కూడా అనర్హులుగా చేయాలి. అప్పుడే గ్రామ పంచాయితీల ఆదాయ వనరులు మెరుగవుతాయి. తద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.


**రిజిస్ట్రేషన్ కన్సల్టెన్సీ & సర్వీసెస్**

ఇండ్లు, ఇండ్ల స్థలములు, సి.ఆర్.డి.ఏ. ప్లాట్లు, పొలములు రిజిస్ట్రేషన్ చేయించబడును. మార్టిగేజ్ బాండ్లు చేయించబడును.
అఫిడవిట్లు నోటరీలు, అగ్రిమెంట్లు చేయబడును. కంప్యూటర్ వర్క్ చేయబడును. స్టాంపులు అమ్మబడును. అన్ని రకముల దస్తావేజులు వ్రాయబడును, మోటారు వాహనములకు ఇన్సూరెన్స్ చేయబడును.

**అడ్రస్ : రాయపూడి మెయిన్ రోడ్,**
**నిమ్మకాయల సెంటర్,**
**గోపి గోపిక రెడిమేడ్స్ ప్రక్కన**
**ఫోన్ : 95024 24704 , 97052 99487**


## హజ్ యాత్ర ఎంపికకు గడువు పెంపు

### 22వ తేదీ వరకు

**రాజధాని వార్తలు ప్రతినిధి,అమరావతి :** సెంట్రల్ హజ్ కమిటీ ద్వారా భారత్ నుంచి 1,19,000 మందికి హజ్ యాత్ర చేసే అవకాశం ఉంది. 2018లో ఆంధ్రప్రదేశ్ హజ్ కోటాలో సుమారు 3,000 మంది హజ్ యాత్ర చేసుకునే అవకాశం వుంది. ఉన్న కోటా కంటే తక్కువ దరఖాస్తులు వస్తే డ్రా అవసరం లేకుండా హజ్ యాత్రకు వెళ్ళే అవకాశం వుంటుంది. కోటా కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే జనవరి మొదటి వారంలో డ్రా జరుగుతుందని ఏపీ స్టేట్ హజ్ కమిటీ ఎగ్జిక్యూటీవ్ అధికారి మహ్మద్ లియాఖత్ అలీ తెలిపారు. ఇప్పటివరకు కేవలం 1,151 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. దీంతో జనవరి 22 వరకు యాత్ర ఎంపిక గడువును ప్రభుత్వం పెంచిందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు http://hajcommittee.gov.in/: దరఖాస్తు పంపాలని అలీ కోరారు.

# స్పీడందుకున్న సీడ్ యాక్సెస్ పనులు

**అమరావతిలో ఏడీసీకి భూమి కేటాయించాలని నిర్ణయం**

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రభుత్వం నిర్మాణ పనులను వేగవంతం చేసింది. ఒక వైపు సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణంతో పాటుగా మరో వైపు పరిపాలన భవనాలను కూడా నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. 2018 నాటికి మొదటి దశ రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేస్తానని ప్రకటించిన ప్రభుత్వం కనీసం 2019 నాటికైన పూర్తి చేయాలని చంద్రబాబు సర్కార్ భావిస్తోంది. దసరా రోజున పరిపాలన భవనాలకు శంకుస్థాపన చేయాలని ప్రభుత్వం అనుకున్నా డిజైన్లు ఖరారు కాకపోవటంతో అనుకున్న రోజున శంకుస్థాపన చేయలేక పోయింది. ఇప్పటికే హైకోర్టు డిజైన్ ఖరారు కాగా అసెంబ్లీ ఆకృతిని మరో నెల రోజులలోఖరారు చేయనున్నారు. వాటితో పాటుగా సచివాలయం, హెచ్‌ఓడీల కార్యాలయాలను, రాజ్‌భవన్, సీఎం హౌస్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఐఏఎస్, ఐపీఎస్‌ల ఇళ్ల భవనాలను రాయపూడి, లింగాయపాలెంలో చేపట్టారు.

రాయపూడి నుంచి శాఖమూరు వరకు



కిలోమీటర్ల వెడల్పు,6 కిలోమీటర్ల పొడవు గల ప్రభుత్వం ప్రకటించిన కోర్ కాపిటల్ ప్రాంతంలో మట్టి నమూనా పరీక్షలను ప్రభుత్వం చేపట్టి భూమి సాంద్రతను సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. ఈ నివేదిక మేరకు నిర్మాణాలను చేపట్టారు. పరిపాలన భవనాల కంటే ముందుగా సీడ్ యాక్సెస్ రోడ్డు త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం తలపెట్టింది. బ్లూ అండ్ గ్రీన్ సిటీలో భాగంగా అమరావతిని బ్లూ సిటీగా మార్చటంలో ఈ రోడ్డు ముఖ్య పాత్ర పోషించనుంది. సీడ్ యాక్సెస్ రోడ్డును కలుపుతూ రాజధానిలో ఆర్టియాల్, సబ్ ఆర్టియాల్ మొత్తం 11 రోడ్లను త్వరితగతిగా పూర్తి చేసి అమరావతిలో రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) ఆర్థికంగా స్వయంప్రతిపత్తి సాధించాలని, అందుకు వీలుగా కొంత భూమిని కార్పొరేషన్‌కు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అడ్డదిడ్డమైన నిర్మాణాలు జరగకుండా రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో, ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. దీంతో రాజధాని ప్రాంత గ్రామాలు, పురపాలక సంఘాలు, నగరాల పరిధిలో ఇష్టానుసారం నిర్మాణాలు చేపట్టడం ఇక వీలుపడదు. సీఆర్డీఏ గట్టి చర్యలు తీసుకుంటుంది. 5 క్లస్టర్లలో 68 టవర్లుగా శాసనసభ్యులు, అఖిలభారత సర్వీస్ అధికారులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులకు గృహనిర్మాణం చేపట్టారు. 12 అంతస్థులుగా ఒక్కో టవర్ నిర్మిస్తారు. ఈ టవర్లకు సంబంధించిన ఆకృతులు ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే ఉంటాయి. రాజధాని అమరావతి నిర్మాణానికి జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) కొన్ని షరతులతో కూడిన అనుమతి ఇవ్వడంతో నిర్మాణాలు వేగం పుంజుకునే అవకాశం ఉంది. రాజధానిలో జరుగుతున్న పనులు వేగవంతమైన ట్లుగా కనిసిస్తోంది. 2018 నాటికి మొదటి దశ రాజధాని పూర్తి చేయాలని ప్రభుత్వం భావించి నప్పటికి డిజైన్లు ఖరారు ఆలస్యంతో కనీసం 2019 నాటికైనా పూర్తి చేయాలని అనుకుంటోంది.


## మన కోసం

| | | | | |
|---|---|---|---|---|
| | శ్రీ విజయలక్ష్మి జనరల్ స్టోర్స్ | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |
| రెస్టారెంట్స్ | బిర్యానిస్ | విజయవాడ | బిర్యానిస్ | 7032202222 |
| | స్వాగత్ మెస్(వెజ్) | మల్కాపురం | చిగురుపాటి | 90329 58580 |
| | ఎస్.ఆర్.కె. గ్రాండ్ | మందడం | శ్రీనివాస్ | 9553023388 |
| షాప్స్ | రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| | వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| | బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| | కె.జి .ఎస్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| | వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | ఎస్‌వి. పున్నారావు | 9848407935 |
| | చైతన్య గోదావరి బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| | ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాలఖాజ | 9441275466 |
| | అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |
| ట్రేడర్స్ | సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| | శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 908073516 |

**మ్యారేజీ లింగ్స్**

| | | |
|---|---|---|
| షేక్ జానీ | విజయవాడ | 9985394613 |

## రాజధానిలో కొత్త పోలీస్ స్టేషన్‌లు

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** రాజధాని అమరావతితో పాటు పరిసరాల్లో కొత్త పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాజధానిలోని సచివాలయం గుంటూరు రూరల్ జిల్లా పరిధిలో ఉంది. సీఎం నివాసం గుంటూరు అర్బన్ జిల్లా పరిధిలో ఉంది. రూరల్ జిల్లా పరిధిలోని రాజధానిలో ఎక్కువ గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుత తుళ్ళూరు పోలీస్ స్టేషన్ ఒక్కటే రాజధానిలో ఉంది.

కొన్ని గ్రామాలు మంగళగిరి రూరల్ తాడేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నాయి. రాజధానికి విఐపీల తాకిడి ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఎస్పై పాలనలో సాగే తుళ్ళూరు పోలీస్ స్టేషన్‌ను రాజధాని ప్రాంతంలో ఏర్పాటు కావటంతో అప్‌గ్రేడ్ చేసి డీఎస్పీ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. అయితే రాజధాని అవసరాల కోసం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌తో పాటు మరో పోలీస్ స్టేషన్ మంజూరు చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే జాతీయ రహదారి ట్రాఫిక్ పర్యవేక్షణకు కాజాటోల్‌ప్లాజా వద్ద మరో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను గోరంట్లలో కొత్త పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అలాగే గుంటూరు నగరంలో కొత్తపేట పోలీస్ స్టేషన్‌ను ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వట్టి చెరుకూరు పోలీస్ స్టేషన్లను మోడల్ పోలీస్ స్టేషన్లుగా నిర్మించనున్నారు. రాజధానిలో విఐపీల భద్రతకు 400 మంది ఏఆర్ కానిస్టేబుళ్ళను,300 మంది సివిల్ పోలీసులను కూడా త్వరలోనే నియమిస్తారని తెలిసింది.

## 'మధ్యాహ్నం' అంగన్‌వాడీల్లో ఫోర్టిఫైడ్ రైస్..



**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** మన రాష్ట్రంలో చిన్నారులలో పౌష్టికాహార లోపం ఉన్నట్లు కొన్ని అధ్యయనాల్లో తేలిందని పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదలకు పౌష్టికాహారం తప్పనిసరి, పౌష్టికాహార లోపం వలన రక్తహీనత వచ్చే అవకాశం ఉన్నందున మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ కేంద్రాల్లో ఫోర్టిఫైడ్ రైస్ అందించడం ద్వారా పౌష్టిక విలువలు పెరుగుతాయని మంత్రులు సోమిరెడ్డి, లోకేష్‌లు పేర్కొన్నారు. సచివాలయంలో టాటా ట్రస్ట్ ప్రతినిధులతో మంత్రులు సోమిరెడ్డి,లోకేష్ భేటీ అయ్యారు. రైస్ ఫోర్టిఫికేషన్ పై చర్చలు జరిపారు. బిడ్డ పుట్టిన నాటి నుండి మొదటి వెయ్యి రోజుల్లో అందించే పౌష్టికా హారాన్ని బట్టే పిల్లల మానసిక, శారీరక ఎదుగుదల ఉంటుందన్నారు. ఆధునాతన టెక్నాలజీ తో రైస్ ఫోర్టిఫికేషన్ చేసి ప్రజలకు అందిస్తే ప్రజల ఆరోగ్యం మెరుగయ్యే అవకాశం ఉంది. అనారోగ్యం బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. పిల్లలలో రైస్ ఫోర్టిఫికేషన్ ద్వారా విటమిన్ ఎ అండ్ డి పుష్కలంగా అందుతున్నదన్నారు. రైస్ ఫోర్టిఫికేషన్ లో ఆంధ్రప్రదేశ్‌కు సహకారం అందించడానికి టాటా ట్రస్ట్ ముందుకు వచ్చిందన్నారు.

# జయహో... మీరాబాయ్ చాను

ఆమె





దేశంలో బాలికలపై ఎంతటి వివక్ష ఎదురైనప్పటికీ ఆ పరిస్థితులన్నింటినీ తట్టుకొని సత్తా చాటుతూనే ఉన్నారు. ఆడపిల్లల శాతం ఎంతగానో తగ్గిన హర్యానాలోకూడా ఇదే హవా నడుస్తోంది. 22 ఏళ్ల తర్వాత వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణపతకాన్ని మళ్లీ మనముందుకు తెచ్చిన వీరవనిత మీరాబాయ్ చాను. అప్పుడు మన రాష్ట్రానికి చెందిన కరణం మల్లీశ్వరి మొదటిసారి 94-95 కిలోలు ఎత్తి మనకు స్వర్ణం అందించగ, రెండో సారి అందుకుంటానికి సుదీర్ఘసమయం వేచిచూడాల్సి వచ్చింది.

అంతర్జాతీయ వేదిక కాలిఫోర్నియాలోని అనాహిమ్ పట్టణ వేదికపై భారత త్రివర్ణ పతకాం మరోసారి రెపరెపలాడింది. ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు స్వర్ణం దక్కింది. కాలిపోర్నియాలోని అనాహిమ్ పట్టణంలో జరుగుతోన్న పోటీల్లో భారత్‌కు చెందిన 23 ఏళ్ల మీరాబాయ్ 194 కేజీలు ఎత్తి చాను స్వర్ణ పతకం కైవసం చేసుకుని రికార్డు సాధించింది. కరణం మల్లీశ్వరి తర్వాత ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలిచిన రెండో క్రీడాకారిణిగా చాను నిలిచింది. 1994,1995లో కరణం మల్లీశ్వరి స్వర్ణం సాధించింది. 48 కేజీల విభాగంలో పాల్గొన్న 23 ఏళ్ల చాను మొత్తం 194 (స్నాచ్ 85చ క్లీన్‌అండ్ జెర్క్-109) కేజీలు ఎత్తి సరికొత్త రికార్డు సృష్టించింది. స్వర్ణం దక్కించుకుంది.

చాను ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌కు చెందినవారు. ఫలితంగా 22 ఏళ్ల తరువాత ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలిచిన రెండో భారత క్రీడాకారిణిగా చాను గుర్తింపు సాధించింది. థాయ్‌లాండ్‌చ కొలంబియాకు చెందిన క్రీడాకారిణీలు రజతం, కాంస్య పతకాలు అందుకున్నారు. స్వర్ణ పతకం అందుకునేందుకు పోడియం వద్దకు వెళ్లే సమయంలో చాను ఉద్వేగానికి లోనైంది. మణిపూర్‌కు చెందిన చాను గత ఏడాది రియో ఒలింపిక్స్‌కు భారత్ తరపున ప్రాతినిధ్యం వహించింది. ఐతే తుది పోరుకు అర్హత సాధించడంలో విఫలమైంది.

– ఖాన్

## ఉద్యోగ నియామకాలకు ఇకపై 42 ఏళ్లు

- గరిష్ట వయో పరిమితి పెంపు
- 2018 సెప్టెంబరు 30 వరకు పొడిగింపు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

**రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి :** ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీలో అభ్యర్థుల గరిష్ట వయో పరిమితి 42 ఏళ్లను మరో ఏడాదిపాటు ప్రభుత్వం పొడిగించింది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్) చేపట్టే అన్ని రకాల ఉద్యోగాల భర్తీకి అభ్యర్థుల గరిష్ట వయో పరిమితిని 42 ఏళ్లను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి బీ శ్రీధర్ సమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2014 సెప్టెంబరు 23 వ తేదీ వరకు ఉద్యోగాల భర్తీలో అభ్యర్థుల గరిష్ట వయో పరిమితి 34 ఏళ్లుగా ఉంది.

అయితే 2016 అక్టోబర్ 17న ప్రభుత్వం ఆ వయో పరిమితిని 34 ఏళ్ల నుంచి 42 ఏళ్లకు పెంచుతూ ఏపీ సబార్డినేట్ సర్వీస్ రూల్ 1996 ప్రకారం ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వుల ప్రకారం 42 ఏళ్ల గరిష్ట వయో పరిమితి ఈ ఏడాది సెప్టెంబర్ 30తో ముగిసింది. ఈవయో పరిమితిని మరో ఏడాది పాటు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్ష నియామయిక విధానంలో చేపట్టే ఉద్యోగాల భర్తీలో అభ్యర్థుల వయస్సు 42 ఏళ్లు ఉన్నా అనుమతిస్తారు. అయితే పోలీసు, ఎక్సైజ్, ఫైర్, జైళ్లు, అటవీశాఖ ఉద్యోగాలకు మాత్రం ఈ నిబంధన వర్తించని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ శాఖలు ఉద్యోగాల భర్తీలో ప్రత్యేకంగా నిబంధనలు రూపొందించుకున్నట్లు ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో గరిష్ట వయో పరిమితి 42 ఏళ్లను మరో ఏడాదిపాటు పొడిగించటంపై నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 'కోల్గేట్ ఐడీఏ' ఉచిత దంత పరీక్షలు...!

**రాజధాని వార్తలు ప్రతినిధి, విజయవాడ :** ఇండియన్ డెంటల్ అసోసియేషన్ భాగస్వామ్యంతో కోల్గేట్ ఇండియా 14వ ఓరల్ హెల్త్ మంత్‌ను ప్రకటించింది. జాతీయ నోటి ఆరోగ్య సంరక్షణ జాగృతి పేరిట రెండు నెలల పాటు ఈ ఓరల్ హెల్త్ మంత్ కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఉచిత డెంటల్ చెకప్‌లు, డెంటల్ కియోస్క్‌లను ఏర్పాటు చేసి అధునాతన డెంటిస్ట్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది.

దేశవ్యాప్తంగా 1276 నగరాల్లోను, 63 నగరాల్లో 156 ఆర్మీ స్టోర్లలో,81 మోడరన్ ట్రేడ్ స్టోర్లలో ఓరల్ హెల్త్ మంత్‌ను జనవరి 31 వరకూ నిర్వహిస్తారు. ఈ ఏడాది ఓరల్ హెల్త్ మంత్‌లో పాకెట్ డెంటిస్ట్ ద్వారా వాయిస్ ఆధారిత ఇంటరాక్టివ్ ప్రోగ్రామ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఓహెచ్‌ఎం ప్యాక్‌పై ప్రకటించిన నెంబర్లకు మిస్ కాల్ ఇస్తే... ఉచిత ఓరల్ కేర్ టిప్స్‌ను, సలహాలు, సూచనలను ఫోన్ ద్వారా పొందే అవకాశం కల్పించారు..కోల్గేట్-పామోలివ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఇస్సామ్ బచలానీ మాట్లాడుతూ, భారతీయుల ముఖంలో చిరకాలం చిరునవ్వులు పూయించాలనే లక్ష్యంతో జాతీయ నోటి ఆరోగ్య సంరక్షణ జాగృతిని చేపట్టామన్నారు. గత ఏడాది 1100 నగరాల్లో 34,000 మంది ఐడీఏ డెంటిస్ట్‌ల సహకారం 60 లక్షల మందికి ఉచిత పరీక్షలు నిర్వహించామన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ డాక్టర్ అశోక్ ధోబ్లే మాట్లాడుతూ, దేశంలోని లక్షలాది మంది దంత ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు కోల్గేట్ ఇండియా, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కృషి చేస్తున్నాయని స్పష్టం చేశారు. 2004 నుంచి ఇప్పటి వరకూ 3 కోట్ల మందికి ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ ఏడాది ఓరల్ హెల్త్ మంత్‌లో 35,000 మంది ఐడీఏ డెంటిస్ట్‌లు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## కాలమ్

### ఫోన్ గణ గణ మోగింది !

జ్యోతి పరుగు పరుగున ఫోన్ దగ్గరకి వెళ్లింది.

" నమస్కారం అండి. మీరు కుక్క తప్పిపోయింది అని పేపర్‌లో ప్రకటన ఇచ్చారు కదా!"

" అవునండీ ! మీకు కనబడిందా! ఎక్కడ కనబడింది? మీరు ఎవరు ? ఎక్కడ ఉంటారు ? మీ దగ్గర ఉందా? ఎలా రావాలి? అది లేక ఇంట్లో అందరం అన్నపానాలు లేకుండా ఉన్నాము." ఏడుపు గొంతుతో అడిగింది జ్యోతి

" మేము వృద్ధాశ్రమం నుంచి మాట్లాడుతున్నామండి. మీరిక్కడ మొన్న వదిలి వెళ్ళిన మీ అత్త మామలను

చూడడానికి మీ కుక్క నిన్న సాయంత్రం వచ్చి ఇక్కడే ఉండి పోయింది."

.............................................................

" హైదరాబాద్"" సికింద్రాబాద్ " అనే పేర్లు ఎలా వచ్చాయో వివరించే కథ.

పూర్వం 400 ఏళ్ళకు ముందు భాగ్యనగరంలో అసదుద్దీన్, అక్బరుద్దీన్ అనే ఇద్దరు ముస్లిం సోదరులు, మూసీనది పక్కన బాతులు మేపుకుంటూ జీవనం చేసేవారు.

ఆ ఇద్దరు సోదరులు ప్రతిరోజూ చాలా దూరం తిరుగుతూ బాతులు కాసేవారు.

ఒకనాడు వారు బాతులు కాస్తుండగా,

ఉన్నట్లుండి ఆకాశంలో ఉరుములు,

మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది.

ఆ ఉరుముల శబ్ధానికి బాతులు చెల్లాచెదరై,

మూలమూల ప్రాంతాలకు వెళ్ళిపోయాయి.

అన్నదమ్ములిద్దరూ అష్టకష్టాలు పడి బాతులన్నిటిని ఇంట్లోని దొడ్డిలోకి చేర్చగలిగారు.

పెద్దవాడైన అసదుద్దీన్ కి సందేహం వచ్చి బాతులన్నింటినీ లెక్కించగా,

ఒక్క బాతు తక్కువగా ఉంది.

వెంటనే అన్నదమ్ములిద్దరూ తప్పిపోయిన

బాతును వెతికి పట్టుకోవడానికి బయలుదేరారు.

అసదుద్దీన్ భాగ్యనగరం అంతా తిరుగుతూ "హేదిరాబాతు" " సిక్కిందిబాతు" అంటూ, తనకు దొరికిన బాతుని అన్నకు సంతోషంగా ఇచ్చాడు.

వాళ్ళిద్దరూ బాతుని తీసుకుని ఇంటికి వెళ్ళారు.

కాలక్రమేణా ఆ అన్నదమ్ములు పలికిన మాటలే కొద్దిగా మార్పు చెంది, " హైదరాబాద్" " సికింద్రాబాద్" గా స్థిరపడ్డాయి.

# అత్యధిక ప్రాచుర్యం పొందిన బిట్‌కాయిన్ కథా కమీషు



ప్రపంచంలో అతి తక్కువ సమయంలో ప్రాచుర్యం పొందిన డిజిటల్ కరెన్సీ బిట్‌కాయిన్. డిజిటలం వైపు పరుగెత్తుతున్న ఆధునిక ప్రపంచం ఈ బిట్‌కాయిన్ అనే సరికొత్త కరెన్సీని రూపొందించింది. వస్తుమార్పిడీ ద్వారా మొదలైన వ్యాపారరంగం వెండి,బంగారు నాణేలు, బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్‌కార్డులను దాటుకుంటూ ప్రపంచ దేశాల్లో డిజిటల్ కరెన్సీముందుకు పోతోంది. దీన్ని మనం ముట్టుకోలేం.. అంటే జేబుల్లో పెట్టుకోలేం. అంటే కేవలం ఇది క్రిప్టో కరెన్సీ మాత్రమే. దీన్ని ఇంటర్నెట్ ద్వారా ఒకరి నుంచి మరొకరి వ్యాలెట్‌లోకి వెళుతుంది. సంతోష్ నకమోటో అనే ప్రోగ్రామర్ దీన్ని 2009లో రూపొందించాడు. ఎక్కడ నుంచి ఎలా రూపొందించాడనే విషయం మాత్రం ఎవ్వరికీ తెలియదు. భారతదేశ కరెన్సీకి ఆర్బీఐ, అమెరికా డాలర్లకు ఫెడరల్ బ్యాంకుల ఆజమాయిషీ ఉంటుంది. అయితే బిట్‌కాయిన్‌కు మాత్రం ఎవరి ఆధీనంలో లేదు. పేటీఎంలను,ఇతర డిజిటల్ మనీట్రాన్స్‌ఫర్స్‌ను మనకు అవసరం లేదనుకుంటే క్లోజ్‌చేసుకోవచ్చుగాని, దీన్ని ఒక్కసారి ఓపెన్ చేస్తే క్లోజ్ చేయలేం. బిట్‌కాయిన్ వాలెట్‌ను ఓపెన్‌చేసి 7,10,13 శాతం అనేవి వస్తాయి. బిట్‌కాయిన్ ఆర్గ.కం పూర్తిగా వచ్చిన తర్వాత వ్యాలెట్‌లను రూపొందించుకోవచ్చు. దీనికోసం అనేక తెలుగు యూ ట్యూబ్స్ కూడా ఉన్నాయి వాటి ద్వారా మీరు మరిన్ని మెళుకవలు నేర్చుకోవచ్చు. 2009లో పుట్టుకొచ్చిన ఈ ఆన్‌లైన్ మనీ విలువ తొలినాళ్లలో కేవలం కొన్ని అమెరికన్ సెంట్లలోనే ఉండేది. కాగా, ఎనిమిదేండ్లలో ఇంతలా ఒక్క బిట్‌కాయిన్ విలువ పెరిగినా, మదుపరులలో ఓపక్క ఆనందం, మరోపక్క ఆందోళన కుపిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశ సెంట్రల్ బ్యాంక్ మద్దతులేని బిట్‌కాయిన్‌కు ఎలాంటి చట్టబద్ధ మారకపు రేటు (లీగల్ ఎక్సేంజ్ రేటు) కూడా లేదు. ప్రత్యేక వేదికలపైనే ఇది ట్రేడ్ అవుతున్నది. అందుకే బిట్‌కాయిన్ ఇన్వెస్టర్లలో ఈ భయాలు. అయినప్పటికీ తక్కువ సమయంలోనే ఎంతో ప్రజాదరణ పొందిన బిట్‌కాయిన్.. స్టాక్, రుణ, కమాడిటీ తదితర సంప్రదాయ పెట్టుబడులకు ప్రత్యామ్నాయ మార్గంగా అవతరించింది. బిట్‌కాయిన్ లావాదేవీలు జరిపేవారు దీన్ని డిజిటల్ గోల్డ్‌గా అభివర్ణిస్తుండటం విశేషం.

**పెరుగుదలకు కారణాలు**

ఆప్షన్స్, ఫ్యూచర్స్ ఎక్స్చేంజ్‌లను నిర్వహిస్తున్న అమెరికాకు చెందిన ఫైనాన్షియల్ మార్కెట్ దిగ్గజ సంస్థ సీఎంఈ గ్రూప్ బిట్‌కాయిన్ కోసం ఓ ఫ్యూచర్స్ మార్కెట్‌ను ప్రారంభించబోతున్నట్లు ప్రకటించింది. బిట్‌కాయిన్ విలువ ఇంతలా పెరుగడాకి ఇదే ప్రధాన కారణం. ఇప్పటిదాకా బిట్‌కాయిన్ తరహా ఏ డిజిటల్ కరెన్సీకి స్టాక్ మార్కెట్ లావాదేవీల్లో చోటు దక్కిన దాఖలాలు లేవు. అలాంటిది బిట్‌కాయిన్‌కు ఆ అవకాశం రావడం దానిపై మదుపు చేస్తున్నవారిలో ఎనలే ఉత్సాహ్నా రేకెత్తించింది. గత నెల వచ్చిన ఈ ప్రకటన నేపథ్యంలో కేవలం గడిచిన రెండు వారాల్లోనే 45 శాతం విలువ పెరుగడం గమనార్హం. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా బిట్‌కాయిన్ విలువ సాంకేతికంగా 940 శాతం పెరుగడం మరో చెప్పుకోదగ్గ పరిణామం. ఆన్‌లైన్ ట్రేడింగ్ వేదికల ద్వారా చికాగో, న్యూయార్క్ సిటీ, లండన్‌లలో భారీ డెరివేటివ్‌లు, ఫ్యూచర్స్ ఎక్స్చేంజ్‌లను సీఎంఈ గ్రూప్ నిర్వహిస్తున్నది.

**లక్షడాలర్లకు చేరువలో...**

కంప్యూటర్ నెట్‌వర్క్‌పై పూర్తి రహస్యంగా జరిగే ఈ డిజిటల్ కరెన్సీ లావాదేవీల్లో (క్రిప్టో కరెన్సీ మార్కెట్) అజ్ఞాత పెట్టుబడిదారుల నుంచి ముస్ముందూ బిట్‌కాయిన్‌కు విపరీతమైన డిమాండు ఉండొచ్చన్న అంచనాలు పెద్ద ఎత్తునే మిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే రాబోయే 6-18 నెలల్లో బిట్‌కాయిన్ విలువ 50,000 డాలర్ల నుంచి ఒక లక్ష డాలర్లకు పెరిగిన ఆశ్చర్యపోనక్కర్లేదు సింగపూర్‌లోపే సాక్సో బ్యాంకుకు చెందిన మ్యాక్రో-క్రిప్టో కరెన్సీ మార్కెట్ విశ్లేషకుడు కే వాన్-పీటర్సన్ అంటున్నారు.

బిజినెస్

**అప్రమత్తంగా ఉండాల్సిందే : నిపుణులు**

బిట్‌కాయిన్ తదితర డిజిటల్ కరెన్సీల్లో పెట్టుబడులకు ఆసక్తి కనబరుస్తున్నవారు అప్రమత్తంగా ఉండకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందు నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**నియంత్రణ లేదు**

బిట్‌కాయిన్‌సహా ఇతరత్రా డిజిటల్ కరెన్సీ లావాదేవీలపై ప్రభుత్వాల నుంచి ఎలాంటి నియంత్రణా లేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కూడా వీటిలో పెట్టుబడులపై ఎవరికివారే బాధ్యులు ప్రకటించింది. తరచూ బిట్‌కాయిన్ తదితర వర్చువల్ కరెన్సీ పెట్టుబడులపై ఆందోళనా వ్యక్తం చేస్తూనే ఉంది. చైనా, దక్షిణ కొరియా ప్రభుత్వాలూ ఆందోళన కనబరుస్తుండగా, జేపీ మోర్గాన్ డిజిటల్ కరెన్సీ మార్కెట్‌ను మోసపూరిత లావాదేవీలుగా అభివర్ణిస్తున్నది.

**పాస్‌వర్డ్ మరిస్తే అంతే సంగతి**

బిట్‌కాయిన్ పెట్టుబడులు అంటే.. డిజిటల్ వ్యాలెట్‌లో నగదు దాచుకున్నట్లే ఉంటుంది. డిజిటల్ కరెన్సీ సర్వీస్‌దారుడితో కలిసి ఖాతాను ప్రారంభించిన మదుపరి ఒక పబ్లిక్, మరో ప్రైవేట్ కీ పొందుతారు. పబ్లిక్ కీ అంటే మీ మొబైల్ నెంబర్ లాంటిది. ప్రైవేట్ కీ అంటే మీ యూజర్ నేమ్, పాస్‌వర్డ్. ఈ రెండింటినీ అత్యంత రహస్యంగా ఉంచుకోవాలి. పాస్‌వర్డ్ మరిచిపోయారో అంతే సంగతి. మీ ఖాతాలో ఎంతున్నది ఎవరికీ తెలియదు. బిట్‌కాయిన్ బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్లూ తిరిగి రావు. ఒకవేళ హ్యాకర్లు మీ బిట్‌కాయిన్లను దొంగిలించినా అవి మళ్లీ రావు.

**నకిలీలతో జాగ్రత్త**

ఎలాంటి నియంత్రణ లే డిజిటల్ కరెన్సీల్లో నకిలీలకు అవకాశాలు ఎక్కువ. కాబట్టి మీరు ఏ డిజిటల్ కరెన్సీలోనైనా పెట్టుబడులు పెట్టదల్చితే దాని గత చరిత్ర, మార్కెట్ విలువ, ప్రాజెక్టు వివరాలను తప్పక పరిశీలించాలి.

**మోసగాళ్లు ఉంటారు**

ఆన్‌లైన్‌లో వందలాది డిజిటల్ కరెన్సీలుండటంతో మోసగాళ్ల బెడద కూడా ఎక్కువే. అధిక లాభాలు అందిస్తామంటూ చాలామంది నకిలీ ఏజెంట్లు తయారవుతున్నారు. అలాంటప్పుడు బిట్‌కాయిన్. ఓఆర్‌జీపై నమోదైన ఎక్స్చేంజ్‌లను సంప్రదించడం ఉత్తమం.

**దేశంలో ఆదరణ ఎక్కువే**

ప్రపంచవ్యాప్తంగా బిట్‌కాయిన్ తరహా వందలాది డిజిటల్ కరెన్సీలున్నా, బిట్‌కాయిన్‌కున్నంత క్రేజ్ మరే కరెన్సీకి లేదు. భారత్‌లోనూ ఈ క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడులు కొన్నేళ్ల నుంచి పెరుగుతూపోతున్నాయి. ఇందులో కేవలం బిట్‌కాయిన్ మదుపరులే ప్రస్తుతం 10 లక్షలకుపైగా ఉన్నారు. విలువ పెద్ద ఎత్తున పెరుగుతుండటంతో భారీగా రాబడి రావచ్చన్న ఆశ పెట్టుబడిదారుల్లో కుపిస్తున్నదు మార్కెట్ వర్గాలు విశ్లేషణ.

– బోస్

### బిట్‌కాయిన్ 16,000 డాలర్లు

**లండన్ :** క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్.. రోజుకో కొత్త రికార్డు సృష్టిస్తూ దూసుకుపోతోంది. తాజాగా ఇది కీలకమైన 15,000 డాలర్ల స్థాయిని దాటేసింది. ఒక దశలో 16వేల డాలర్ల పైన ట్రేడయింది. దీంతో' బ్రేకుల్లేని రైలులాగా పరుగులు తీస్తున్న' బిట్‌కాయిన్ ఇతర ప్రధాన మార్కెట్లకు ఎలాంటి ముప్పు తెచ్చిపెడుతుందోనని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం వారం వ్యవధిలోనే 50 శాతం పెరిగి 12,000 డాలర్ల స్థాయిని తాకిన బిట్‌కాయిన్ అంతలోనే మళ్లీ 16,000 డాలర్లకు ర్యాలీ చేయడం గమనార్హం.' ఊహించడానికి సాధ్యంకానంత స్థాయిలో కొత్త ఇన్వెస్టర్లు క్రిప్టో కరెన్సీని పోగు చేసుకుంటున్నారు. దీంతో బిట్‌కాయిన్ ప్రస్తుతం బ్రేకుల్లేని రైలులాగా పరుగులు తీస్తున్నట్లు కనిపిస్తోంది' అని ఆస్ట్రేలియాకి చెందిన ఏఎస్‌ఆర్ వెల్త్ సంస్థ సలహాదారు షేన్ చానెల్ వ్యాఖ్యానించారు. అయితే, ఈ విపరీతమైన ఉత్సుకత కాస్త తగ్గితే.. కచ్చితం బిట్‌కాయిన్ విలువ కరెక్షన్‌కి లోనయ్యే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

## మణిశంకర్ అయ్యర్ సేవలు

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రంగా మందలించారు. అయితే ఒకే ఒక్క వ్యక్తి ఎల్కే అద్వానీ మాత్రమే ఆయనకు మద్దతు నిచ్చారు. **ఒక ప్రముఖ తెలుగు పత్రికలో ఆయన పళ్లు వాజ్‌పేయిబ్రష్ చేస్తున్నట్లు వచ్చిన కార్టూను ఇంకా గుర్తుంది.** ఇదంతా సీనియర్‌సిటిజన్లకు, రాజకీయనాయకులు, జర్నలిస్టులకు తెలిసిన విషయమే.. ఎన్నికల తర్వాత మణిశంకర్ అయ్యంగార్‌పై ఆంక్షలను తొలగిస్తారనే ఊహగానాలు ఉన్నాయి. రాజీవ్‌గాంధీలా ఆయన మేథోసంపత్తిని రాహుల్ కూడా ఉపయోగించుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు.

– బోస్

## నాపై ఎందుకింత కక్ష ? : వాపోతున్న మోడీ

**అహ్మదాబాద్ :** నిన్నటివరకు పొగడ్తలే విన్న మోడీ ఇప్పుడు తెగడ్తలను భరిచాల్సి వస్తోంది. తనను అవమానిస్తూ పలువురు నేతలు వ్యాఖ్యలు చేశారంటూ మోడీ వాపోతున్నారు. 'ఇమ్రాన్ మసూద్ నన్ను ముక్కలు చేయాలన్నారు, రేణుకా చౌదరి నన్ను వైరస్ అంటూ సంబోధించారు. మరో కాంగ్రెస్ నేత ఉన్నారు. ఆయన ఏకంగా నన్ను కోతితో పోల్చారు. జైరాం రమేష్ 'భస్మాసుర్' అంటారు. బేనీ ప్రసాద్ వర్మ పిచ్చి కుక్క అంటూ పిలిచారు. గంగూ తేలి అని గులాం నబీ ఆజాద్ ఆమధ్య ఆరోపించారు. ప్రజాజీవితంలో ఇలాంటి మాటలు ఎవరైనా అంటారా?' అని మోడీ ప్రశ్నించారు. తనను పరుషంగా మాట్లాడిన మరికొందరిని కూడా మోదీ ప్రస్తావిస్తూ 'మోడీ సర్కార్‌ది ఓ రాక్షస రాజ్యమని, మోడీ రావణుడని దిగ్విజయ్ సింగ్ అంటారు. ప్రమోద్ తివారీ అయితే నన్ను హిట్లర్, ముసోలిని, గడాఫి జాబితాలో చేర్చాలని చెప్పారు. పగలూ ,రాత్రి తేడాలేకుండా కాంగ్రెస్ వారు నన్ను దూషించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన వాపోయారు. కేవలం పనికే ప్రాధాన్యం ఇవ్వడం వల్లనే నేను మౌనంగా ఉంటూ వచ్చాను. ఇక ఆనంద్ శర్మ ఉన్నారు. ఆయన మోదీకి మతిస్థిమితం లేదనేశారు. మరో కాంగ్రెస్ నేత అన్న మాట నా నోటితో నేను చెప్పలేను. రెండ్రోజులు క్రిందట నీచుడంటూ అయ్యర్ సంబోధించారు. సోనియాగాంధీ, ఆయన కుటుంబ సభ్యులు కూడా ఇలాగే మాట్లాడారు. నేను నీచుడ్ని ఎందుకయ్యాను. ఎందుకంటే నేను పేద కుటుంబంలో పుట్టాను, తక్కువ కులానికి చెందిన వాడిని (కోమటి కులం తక్కువదా?), గుజరాతీని. ఇవేనా నన్ను వాళ్లు తిట్టిపోయడానికి కారణాలు?' అంటూ మోడీ తనను అవమానపరిచిన వారిపై నిప్పులు చెరిగారు. రాష్ట్రవ్యాప్తంగా తాను చేపట్టిన ప్రచారంలో ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని, గుజరాత్‌లో బీజేపీ విజయం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ప్రతిరూపాయికి లెక్కుంది

(మొదటిపేజీ తరువాయి)

శాఖా మంత్రి నితిన్ గడ్కరీ ఈనెల 22న పోలవరం రానున్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కొన్ని పనులను నిలిపివేయాల్సిందిగా గత వారం కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు అందడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దారితీసింది. కాని రెండు రోజుల క్రితమే పోలవరం ప్రాజెక్టు పనులను యధావిధిగా కొనసాగుతాయని గడ్కరీ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రాజెక్టును ఆసాంతం తనిఖీ చేయడమే కాకుండా అధికారిక సమీక్ష నిర్వహిస్తారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని నివేదికలను సిద్ధం చేసింది.

## నేవీ సేవలు భేష్

### విశాఖలో రాష్ట్రపతి రామ్‌నాధ్ కోవింద్



**విశాఖపట్నం :** రక్షణ వ్యవస్థలో పాటు దేశ ఆర్థిక వ్యవస్థకు భారత నావికాదళం అందిస్తున్న సేవల అభినందనీయమని భారత రాష్ట్రప్రతి రామ్‌నాథ్ కోవింద్ కొనియాడారు. విశాఖలో రెండవరోజు పర్యటనలో భాగంగా నావికాదళం అధికారులు ఐఎస్ఎస్ సార్కార్ పరేడ్ గ్రౌండ్ ఏర్పాటుచేసిన నావీ,ఆర్మీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో రాష్ట్రప్రతి ముఖ్యఅతిధిగాపాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. నౌకాయానికి భారతదేశంలో ఎంతో ప్రాధాన్యత ఉందని రాష్ట్రప్రతి అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థకు ఈ రంగం ప్రధానమన్నారు. దేశంలో జరుగుతున్న 90 శాతం వాణిజ్య వ్యాపారాలు నౌకల సాయంతోనే జరుగుతున్నాయన్నారు. నావికాదళంలో జలాంతర్గామి విభాగం కీలకా పాత్ర పోషిస్తోందన్నారు. జలాంతర్గామి జలం విశిష్ట సేవలకు గాను 'ప్రెసిడెంట్స్ కలర్స్' అను విశిష్ట పురస్కారాన్ని సబ్‌మెరైన్ లెఫ్ట్‌నెంట్ కమాండర్ తేజేందర్ సింగ్‌కు రాష్ట్రప్రతి అందించారు. అనంతరం ఐఎస్ఎస్ డేగాలో రాష్ట్రపతికి ఘన వీడ్కోలు పలికారు. గవర్నర్ నరసింహన్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు నావికాదళాధిపతి సునీల్ లంబా తూర్పు నావికాదళాధికారి కరంబీర్‌సింగ్, కేంద్ర మంత్రి అశోకగజపతిరాజు, రాష్ట్ర మంత్రి చిన్నరాజప్పతో పాటు జిల్లా కలెక్టర్, పోలీస్‌కమిషనర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నక్షత్రం ఏం చెబుతోంది ?



ఏడాదంతా ఇట్టే గడిచిపోయినట్లనిపిస్తోంది. ప్రస్తుతం చివరినెల అంటే డిసెంబర్, అదే క్రిస్టమస్ నెల్లో ఉన్నాము. డిసెంబరు నెలంతా ఈ జోష్ కొనసాగుతూనే ఉంటుంది. క్రిస్మస్ అనగానే ఇంటిముందు వేలాడదీసే స్టార్ (నక్షత్రం) క్రిస్మస్ ట్రీ, క్రిస్మస్‌తాత, నోరూరించే కేకులు, కొత్తబట్టలు వాహ్...ఇవన్నీ గుర్తుకొస్తాయి. అయితే వీటిన్నింటిలోనూ పూర్తి భిన్నత్వం కలిగింది స్టార్.. అసలు క్రిస్టియన్లకు పట్టింపులు ఉండవు.. వాళ్లు జాతకాలు వగైరా చూపించుకోరు అంటారు. మరీ ఈ నక్షత్రం సంగతి ఏంటి? ఏసుక్రీస్తు పుట్టింది మధ్యాసియాలోని బెత్లెహేమ్ నగరంలో అంటే అప్పటికే అక్కడ నక్షత్రాలు, జన్మరాశులు, జాతకాలు వగైరా ఉన్నాయని దీన్ని బట్టి తెలుస్తోంది. అంతేకాదు మధ్య ఆసియాలో అప్పటికే ఖగోళ, జ్యోతిష్య శాస్త్రాలు అభివృద్ధిలో ఉన్నాయని తేటతెల్లం అవుతోంది. కృష్ణుడు,రాముడు పుట్టినప్పుడు నక్షత్రాల గురించి ఎటువంటి ప్రకటనలు జరిగినట్లు దాఖలాలు లేవు. ఆకాశంలోని ఒక తార ఉదయిస్తుందని అది మెస్సియా పుట్టుకకు గుర్తని బైబిల్ పాత నిబంధనా గ్రంథంలోనే వెలువరించింది. ఆ తార ఉదయించిన సమయం, కాంతి, వెలుగు కోణాలు, ఆకాశంలోని దిశ వీటన్నింటినీ బట్టి అప్పటి జ్ఞానులు సమస్త లోకాన్ని పాలించే కరుణామయ ప్రభువు పుట్టాడని తెలుసుకున్నారు. బైబిల్ ఈ విషయాలను ముందుగానే స్పష్టం చేసింది. ఆయనను చూడటం తమ జీవితలక్ష్యంగా ఎంచుకుని బయలు దేరారు. ఆకాశంలోని నక్షత్రాన్ని చూస్తూ యెరూషలేముకు 6 మైళ్ల దూరంలోని బెత్లెహేమ్ నగరానికి వీరంతా ప్రయాణించారని, వారంతా జపాన్, చైనా, భారత్‌నుంచి వెళ్లారని బైబిల్ పండితులు చెబుతారు. అయితే వారు ఏసును చేరుకుంటానికి సుమారు 8 నెలలు పట్టిందని చరిత్రకారులు చెబుతున్నారు.

డిసెంబరు 25న ఏసుక్రీస్తు పుట్టాడని చెప్పడానికి ఖచ్చితమైన ఆధారాలు లేవు. అయితే అప్పటి రాజు సీజర్ అగస్టస్ ఆజ్ఞప్రకారం జనాభాలెక్కలకు ఆదేశించడం, క్రీస్తు తల్లి మరియ, తండ్రి జోసెఫ్ జనాభా లెక్కల నమోదుకు బెత్లెహేమ్‌కు వెళ్లడంతో పండితులు ఆ సమయాన్ని నిర్ణయించారంటారు. ఐగుప్తులో బానిసత్వం అనుభవిస్తున్న ఇశ్రాయేలీలంతా మోషే నేతృత్యంలో కనానుకు వెళ్లిన సందర్భంగా 40 ఏళ్ల ప్రయాణాన్ని గుర్తుపెట్టుకొని జరిపించే పండుగ రోజును ప్రతి ఏడాది డిసెంబరు 25న క్రీస్తు జన్మదినంగా నిర్ణయించారని కొందరు, రోమన్ చక్రవర్తి జూలియస్ సీజర్ తన రాజ్యంలో వైభవంగా జరుపుకునే పండుగ 'సాచురేలియా' రోజే ఈ పండుగను నిర్ణయించారని మరికొందరు చరిత్రకారులు చెబుతున్నారు. నక్షత్రాల బట్టి జాతకాలు తెలపడం గ్రీకుల నుంచి భారతీయులు నేర్చుకున్నారు. ఆర్యభట్టు మొదటి అంతరిక్ష శాస్త్రవేత్త. నక్షత్రాలను బట్టి గుణగణాలను, లక్షణాలను ఆరోజుల్లో అంచనా వేసేవారు. ఇప్పటికీ మనుమలు మనుమరాళ్లు విసిగిస్తుంటే బామ్మలంతా ఏ నక్షత్రాన పుట్టావురా ఇంత అల్లరి చేస్తున్నావు అని విసుక్కోవడం మనకు తెలిసిందే.

**హేలీ తోకచుక్క ప్రతి 79 సంవత్సరాలకు ఒకసారి దర్శనం ఇస్తుంది. తోకచుక్క కనిపించిన ప్రతిసారీ ఒక మహానుభావుడు పుట్టడం లేదా మృతి చెందడం జరుగుతుందని విశ్వసించేవాళ్లు ఉన్నారు. అలాగే ప్రప్రథమ ప్రధాని నెహ్రూ మరణించే ముందు తోకచుక్క కనిపించిందని ప్రచారం జరిగింది.**

## ఈ పండ్లు తింటే..
## బరువు తగ్గడం ఖాయం..!






నేటి తరుణంలో ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధ వహిస్తున్నారు. వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం, వేళకు భోజనం చేయడం ఇలా ప్రతి అంశంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే ఇవే కాకుండా బరువు తగ్గాలని కచ్చితంగా నిర్ణయించుకున్న వారు మాత్రం ఆరోగ్యకరమైన డైట్‌ను పాటించడం అవసరమే. కింద పేర్కొన్న పండ్లు అధిక బరువును తగ్గించేందుకు దోహదపడడంతోపాటు శరీరానికి కావల్సిన పౌష్టికాహారాన్ని కూడా అందిస్తాయి. వాటి గురించిన వివరాలు మీ కోసం...

- **యాపిల్:** యాపిల్స్‌లో క్యాలరీలు తక్కువగా, పీచు అధికంగా ఉంటుంది. ఆహారాన్ని జీర్ణం చేసేందుకు బాగా ఉపయోగపడతాయి. ఇందులో ఉండే పెక్టిన్ కడుపు నిండిన భావనను కలగజేస్తుంది. దీంతో ఎక్కువ సేపు ఉన్నా త్వరగా ఆకలి వేయదు. అదేవిధంగా మన శరీరానికి కావల్సిన యాంటీ ఆక్సిడెంట్లను ఇది పుష్కలంగా అందిస్తుంది. 100 గ్రాముల యాపిల్ తింటే దాదాపు 1500 మిల్లీగ్రాముల విటమిన్ సి అందుతుంది. ప్రతి రోజూ ఒక యాపిల్ తింటే కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- **అరటి పండు:** అరటిపండులో నీరు, పీచు పదార్థం అధికంగా ఉంటాయి. మలబద్దకాన్ని ఇది నివారిస్తుంది. ఆకుపచ్చ రంగులో ఉండే అరటిపండ్లలో ఫ్యాట్ కరిగే ప్రాసెస్‌ను వేగవంతం చేసే పోషకాలు ఉంటాయి. అరటిపండు ఒకటి తిన్నా కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. అప్పుడప్పుడు అరటిపండ్లు తిని నీరు తాగడం వల్ల రోజంతా కడుపు నిండుగా ఉంటుంది.
- **గ్రేప్ ఫ్రూట్:** దాదాపు అన్ని రకాల విటమిన్స్‌తోపాటు మంచి సాచురేటెడ్ ఫ్యాట్స్ ఇందులో ఉంటాయి. బరువు తగ్గించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. చర్మ సంరక్షణలోనూ ఈ పండు మెరుగ్గా పనిచేస్తుంది.
- **టమాటాలు:** విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్స్ టమాటల్లో పుష్కలంగా ఉంటాయి. శరీరానికి కావల్సిన పోషకాలన్నీ ఇందులో లభిస్తాయి. వీటిలోని లైకోపీన్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. టమాటా జ్యూస్‌ను నిత్యం తీసుకుంటే బరువు తగ్గేందుకు అవకాశం ఉంటుంది.
- **లెమన్ జ్యూస్:** నిమ్మకాయల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. మెటబాలిజంను వేగవంతం చేస్తుంది. స్లిమ్‌గా ఉండేందుకు ఉపయోగపడుతుంది. ఎసిడిటీ వంటి అనారోగ్యాలను దూరం చేస్తుంది. భోజనం చేసిన తరువాత నిమ్మరసం తాగడం శరీరానికి చాలా మంచిది. శరీరాన్ని చల్లబరుస్తుంది. ఇందులోని సిట్రస్ యాసిడ్ శరీర బరువు పెరగనీయకుండా చేస్తుంది. నిమ్మరసం, తేనెల మిశ్రమం మహిళల బరువు తగ్గించేందుకు అద్భుతంగా పనిచేస్తుంది. కొవ్వు కణాలతో పోరాడగలిగే శక్తి నిమ్మకు ఉంది. ఇది ఆకలిని తగ్గించి జీర్ణశక్తిని పెంచుతుంది.
- **అవకాడో:** వయస్సు మీద పడుతున్నప్పటికీ శరీరాన్ని ఇంకా యవ్వనంగానే ఉంచేందుకు ఇవి దోహదపడతాయి. వీటిలో మోనో అన్‌సాచురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువ. శరీరానికి ఇవి ఆరోగ్యాన్ని కలగజేస్తాయి. వీటిల్లో ఉండే ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు చర్మ సంరక్షణకు ఉపయోగపడితే, విటమిన్ సీ, ఈలు వృద్ధాప్య ఛాయలను దరిచేరనివ్వవు. దీంతోపాటు అధిక బరువు కూడా తగ్గవచ్చు.

# 12న వారి పెళ్లంట...

క్రీడలు



టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, బాలీవుడ్ నటి అనుష్క శర్మల వివాహం డిసెంబరు12న ఇటలీలో కొందరు సన్నిహితుల మధ్య నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఓ వైపు లంకతో టెస్ట్ సిరీస్ తర్వాత కోహ్లీ విశ్రాంతి తీసుకోవడం,అనుష్క ప్రస్తుతం షారుక్‌తో నటిస్తున్న సినిమా చిత్రీకరణ నుంచి విరామం తీసుకున్నట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం ఇందుకు ఊతమిస్తోంది. విరుష్క (విరాట్-అనుష్క) జోడీ వివాహం ఈ సమయంలో మరో అప్‌డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ ఊహాగానాల నేపథ్యంలో అనుష్క గురువారం రాత్రి తన కుటుంబంతో కలిసి ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యక్షమయ్యారు.అక్కడి మీడియా పెళ్లి కోసం ఇటలీ వెళుతున్నారా అంటూ ప్రశ్నలు కురిపించింది. కానీ ఇందుకు అనుష్క ఎలాంటి సమాధానం ఇవ్వకుండా థ్యాంక్యూ అని చెప్పి వెళ్లిపోయారు. ఆ తర్వాత అనుష్క తల్లిదండ్రులను పెళ్లి గురించి ప్రశ్నించినా వారు కూడా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. అయితే కూతురి వివాహానికి తప్పకుండా హాజరుకావాలంటూ బంధువులు, తమ ఇంటి చుట్టుపక్కల ఇళ్లల్లో ఉండే ఫ్యామిలీ ఫ్రెండ్స్‌ను అనుష్క తండ్రి అజయ్ కుమార్ శర్మ స్వయంగా ఆహ్వానించారట. అయితే ఈ విషయాన్ని బయట ఎవరికీ లీక్ చేయొద్దని, ఈ విషయం ఆనోటా ఈనోటా పాకి ప్రచారమైతే పెళ్లి వేడుకకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని అనుష్క తండ్రి ఆందోళన చెందుతున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. తొలుత ఇటలీలో పెళ్లి చేసుకోనున్నారని వార్తలు వెలువడ్డాయి. ఇప్పుడు స్విట్జర్లాండ్‌లో చేసుకోబోతున్నట్లు తెలుస్తోంది. దీనిపై విరాట్, అనుష్క స్పందిస్తే కానీ ఓ క్లారిటీ వచ్చేలా లేదు.

**సంపాదనలో హేమా హేమీలు**

పెళ్లాడబోతున్న విరుష్కాలకు అత్యధిక సంపాదన ఉంది.'రబ్ నే బనా ది జోడీ'తో బాలీవుడ్‌లో మంచి పేరు సంపాదించుకున్న అనుష్క శర్మ, బ్యాండ్ బాజా భారత్ వంటి సినిమాలతో ఆమె కెరీర్ పైపైకే ఎగిసింది. 2014లో తన సోదరుడితో కలిసి ఆమె ప్రొడక్షన్ హౌజ్ ప్రారంభించింది. ఈ ప్రొడక్షన్ హౌజ్ కింద ఒక్కో సినిమాకు రూ.5 కోట్లను, బ్రాండ్ ఎండోర్స్‌మెంట్‌కు రూ.4 కోట్లను తీసుకుంటోంది. ఆమె వ్యక్తిగత పెట్టుబడులు రూ.36 కోట్ల మేర ఉన్నాయి. రూ.5 కోట్ల విలువ చేసే నాలుగు లగ్జరీ కార్లుతో కలిపి అనుష్క ఆస్తులు రూ.220 కోట్ల మేరకే ఉన్నట్టు నివేదికలు చెబుతున్నాయి. వచ్చే మూడేళ్లలో అనుష్క సంపద 30 శాతం మేర పెరిగే అవకాశముంటుందని తెలుస్తోంది.

క్రికెట్ లెజెండ్ అయిన విరాట్ కోహ్లికి కూడా భారీ సంపద ఉంది. ప్రతి అంతర్జాతీయ మ్యాచ్‌లోనూ ఆయన అత్యధిక వేతనం పొందుతున్నాడు. అంతేకాక ఐపీఎల్ మ్యాచ్‌ల్లో అధిక చెల్లింపులు అందుకుంటున్న క్రీడాకారుడిల్లో విరాటే ముందంజలో ఉన్నాడు. రెండు నెలల ఈ సీజన్‌లో రూ.14 కోట్లను ఆర్జిస్తున్నాడు. ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువగా ఉన్న ఈయనకు, పుమా, ఎంఆర్ఎఫ్ వంటి బ్రాండ్స్ భారీ ఎత్తున్న ఎండోర్స్‌మెంట్‌లు ఆఫర్ చేస్తున్నాయి. భానీ బ్రాండు విలువ కలిగిన క్రీడాకారుల్లో ఫోర్బ్స్ జాబితాలో విరాట్ కోహ్లి ఏడవ స్థానంలో ఉన్నాడు. ఈయనకు రూ.42 కోట్లు విలువ చేసే ప్రాపర్టీలు, రూ.18 కోట్ల పెట్టుబడులు, రూ.9 కోట్ల విలువ చేసే ఆరు లగ్జరీ కార్లు, ఇలా విరాట్ మొత్తం రూ.390 కోట్ల ఆస్తులను కలిగి ఉన్నాడు.

# యత్ర నార్యస్తు పూజ్యతే తత్ర దేవతా: రమంతే

సినిమా



బీజేపీ ప్రభుత్వపాలనలో అసహనం పెరిగిపోయిందన్న వాస్తవం ప్రపంచానికి తెలుసు. విచారకరమైన విషయం ఏమంటే ప్రభుత్వం దాన్ని నిరోధించడానికి ఏమాత్రం ప్రయత్నించడం లేదు సరికదా దాన్ని పెంచి పోషించడానికే అత్యధిక ప్రాధాన్యత నిస్తోంది. ఇది ఎంతమాత్రమూ సహించరాని అంశమే అయినా ప్రజలకు భరించడం తప్పడంలేదు దీంతో మతోన్మాదులు పెట్రేగిపోతున్నారు. మహిళలకు, బాలికలకు రక్షణ కరువైంది. చట్టాన్ని ఎవరికి వారు చేతుల్లోకి తీసుకుంటున్నారు.

సినిమాలను చూడకుండా కూడా రాజకీయాలు చేస్తున్నారు. వారికి నచ్చిందే కాని ఎలాంటి వివరణలను, వాస్తవాలను వారు పరిగణలోకి తీసుకోవడం లేదు. నిన్నటి వరకు మెర్సెల్‌పై మండిపడ్డ బీజేపీవాదులు నిర్మాణం దశ నుంచి పద్మావతి చిత్రంపై విరుచుకు పడుతున్నారు. 'యత్ర నార్యస్తు పూజ్యతే తత్ర దేవతా: రమంతే (ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు నాట్యం చేస్తారు) అని చాటే భారతదేశంలో సినిమానటిని నరికి చంపుతాం..లేదా ముక్కు చెవులూ కోస్తాం అంటే హెచ్చరిస్తుంటే ఎంతగా దిగజారిపోయిందో సమాజం అని ఆవేదన కలుగుతోంది.

బన్సీలాల్ నాలుగురోజు క్రితం పార్లమెంటరీ కమిటీ వద్దకు వెళ్లి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. సినిమా సెన్సార్ కాకుండా ఆందోళనాకారులకు చిత్రాన్ని ఎందుకు చూపించాల్సి వచ్చిందని కేంద్ర సెన్సార్ బోర్డు ఛైర్మన్ పహ్లాజ్ నిహ్లాని, దర్శకుడు సంజయ్‌లీలా బన్సాలీపై ఫైర్ అవడం ఈ దేశంలో రెండు వర్గాల మధ్య ఇరుక్కుపోయిన దర్శకుడి అసహాయ స్థితికి అద్దం పడుతోంది.

కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్న రాష్ట్రాలను బొంబే హైకోర్టు తాజాగా మందలించింది. పద్మావతి చిత్రంపై కోర్టు స్పందిస్తూ ఏ దేశంలోనూ కళాకారులను ఇలా చంపేస్తామంటూ బెదిరించరని పేర్కొంటూ, కష్టపడి తీసిన సినిమాను బెదిరింపులకారణంగా విడుదలకు నోచుకోకపోవడం బాధాకరమని, మన సమాజం ఏ పరిస్థితికి చేరుకుందని వాపోయింది. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు సినిమాను నిషేధించడం సెన్సార్‌షిప్‌కు పోటీగా జరిగిందని, ఇది దారుణమని పేర్కొంటూ, 'పేరు, డబ్బున్న వారికే ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నప్పుడు పేదల సంగతేంటి?' అని బాంబే హైకోర్టు న్యాయమూర్తులు ధర్మాధికారి, భారతి డాంగ్రేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్ ఎన్నికల నేపథ్యంలో విడుదలకు నోచుకోని ఈ సినిమా 2018 ఫిబ్రవరిలో ఈ చిత్రం విడుదలయ్యే అవకాశం ఉందంటున్నారు. **- ఖాన్**

## రూ.200 నోటుకు అప్పుడే నకిలీలు



**జమ్ము :** పెద్ద నోట్ల రద్దు తర్వాత కొత్తగా వచ్చిన రూ.2000, రూ.500 నోట్లకు కొనసాగింపుగా ఆగస్టులో రూ.200 నోట్లను కూడా ఆర్‌బీఐ విడుదల చేసిన సంగతి తెలిసిందే. చలామణిలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఇప్పటికీ ఆ నోటును చాలామంది చూసి ఉండరు. కానీ, ఈ నోటుకు అప్పుడే నకిలీలను సృష్టించేశారు. ఇలా నకిలీ నోట్లను ముద్రిస్తున్న ఓ వ్యక్తిని జమ్ము పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.6.36 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. జమ్ము శివారులో ఓ ఇంట్లో ప్రింటర్ సాయంతో నకిలీ నోట్లను ముద్రిస్తున్న షౌకత్ అహ్మద్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.200 ముఖవిలువ కలిగిన 270 నోట్లు, 1150 రూ.500 నోట్లు,19 రూ.50 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల మహ్మూద్ మక్బుల్ అనే వ్యక్తి నుంచి నకిలీ కరెన్సీ స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఆ దిశగా ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టడంతో నిందితుడిని పట్టుకున్నారు. నగదుతో పాటు కంప్యూటర్, స్కానర్, పేపర్ కటింగ్ యంత్రం, జిరాక్స్ కాగితాలను స్వాధీనం చేసుకున్నారు.

# రాహుల్ నేర్చుకోవాల్సింది చాలా ఉంది..





హార్దిక్‌పటేల్



జిగ్నేష్ మేవానీ



అల్పేష్ ఠాగూర్

**యుద్ధాన్ని ఏ రాజు సైనికులకు అప్పగించి, యుద్ధ క్షేత్రం నుంచి వైదొలగడు వీరత్వాన్ని ప్రదర్శిస్తూ, పరివారాన్ని జాగృతం చేసి అచంచల దేశభక్తిని రగిలిస్తారు. అప్పుడే ఆ రాజు మహాశక్తిసంపన్నుడుగా గుర్తించబడతాడు.**

ప్రస్తుతం రాజ్యాలు, రాజరికం లేకపోయినప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ పార్టీని ముందుకు నడిపిస్తూ, ఎప్పటికప్పుడు ఎన్నికల వ్యూహరచన చేస్తూ ముందుకు పోవాల్సిన తరుణం ఇది. అయితే వందేళ్ల కాంగ్రెస్‌కు యువ నాయకత్వం ఉన్నా, వార్ధక్య లక్షణాలతో ముందుకు పోలేకపోవడం విచారకరం.

మోతీలాల్ నెహ్రూ నుంచి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న కుటుంబంలో ప్రస్తుతం సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకొని ప్రజల ఆకాంక్షకు తగ్గట్టుగా కార్యక్రమాలను నిర్వహించడంలో విఫలం చెందుతున్నారు. దేశ రాజకీయాల్లో తమ దైనముద్రవేసిన నెహ్రూ,ఆపై ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల కుటుంబం అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఆ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేయలేకపోతున్నారు. నాయకత్వ లోపం ప్రజలకు శాపంగా పరిణమించింది. దేశ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రజల నాడి తెలుసుకొని ఎప్పటికప్పుడు తమ లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు సాగలేకపోవడం బీజేపీకి వరంగా మారింది. అది హిందుత్వ, విభజన వాదనను, వాటి అనుబంధ సంస్థలైన వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్‌లాంటి మతోన్మాద శక్తులు చెలరేగడాని కారణమైంది. 2జీ, 3జీ స్కాములతో గత ఎన్నికల్లో ప్రజల తిరస్కారానికి గురైన కాంగ్రెస్ ప్రస్తుతం మోడీ ప్రభుత్వంపై ప్రజలకున్న వ్యతిరేకతను అందిపుచ్చుకొని, మోడీకి రాజకీయ బిక్షపెట్టిన గుజరాత్‌లో దాదాపు 20 ఏళ్ల తర్వాత ఓడించే అవకాశం ఉన్నా వెళ్లి ఢిల్లీలో కూర్చోవడం, అదీ ఏఐసీసీలో అధ్యక్షుడిగా బరిలో దిగి పార్టీ సొంతవ్యవహారాల్లో బిజీగా ఉండటం కాంగ్రెస్ అభిమానులను ఆవేదనకు గురిచేస్తోంది.

ఇంతకు ముందు జరిగిన ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో రాహుల్, ప్రియాంకలు ప్రచారం చేస్తారని మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ప్రకటించగా, ఒక్క ర్యాలీలో పాల్గొన్న ప్రియాంక మిగతా ఎన్నికల ప్రచారంలో కన్పించనేలేదు. సోనియాగాంధీ అనారోగ్యకారణాలతోనే ఆమె వెళ్లిపోయారని పార్టీ సరిపుచ్చుకుంది. అదే సమయంలో గోవా మణిపూర్‌ల్లో గెలిచినప్పటికీ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులైన సోనియా,రాహుల్ గాంధీలు సత్వర నిర్ణయాలు తీసుకోవడంలో తాత్సారం చేయడంతో రెండు రాష్ట్రాలను బీజేపీ కుయుక్తిగా దక్కించుకుని తమ ప్రభుత్వాలను నిలుపుకుంది. **పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించడంలో అమరీందర్ సింగ్ ఒంటి చేత్తో పోరాటం చేయాల్సి వచ్చింది.** ఈ ఘటనతో అయినా జాగ్రత్త పడవలసిన కాంగ్రెస్ కావాలనే అధ్యక్ష ఎన్నికలతో బిజీ అయిందనిపిస్తోంది. ఈప్రక్రియను ఒక నెల ముందు, లేదా వెనుక పెట్టుకొని గుజరాత్ ఎన్నికల్లో హోరుగా ప్రచారం చేసి బీజేపీ అంటే మోడీ,అమిత్‌షా అనే బలమైన కోటను బద్దలు చేయడానికి తమ వంతు కృషి జరిపే అమూల్యమైన సమయాన్ని కాంగ్రెస్ ఇంటి రాజకీయాలకు కేటాయించడం అసమంజసంగా ఉంది. ఎన్నికలను ఆరాష్ట్ర యువనాయకత్వానికి , హార్దిక్‌పటేల్, అల్పేష్ ఠాగూర్, జిగ్నేష్ మేవానీలకు అప్పగించి పట్టాభిషేకం కోసం రాహుల్ కీలకమైన సమయాన్ని వినియోగించడం అత్యంత అవివేకం. హార్దిక్ పటీదార్లకు, అల్పేష్ ఓబీసీలకు, జివేష్ మేవానీ దళితుల ఓట్లు రాబట్టడానికి రాష్ట్రంలో విపరీతమైన కృషి చేస్తున్నారు. బహుశ రాజుగా కిరీటం పొందబోతున్న యువరాజు ప్రజలు ఓట్లు వేసేవరకు వేచి చూడటమే మంచిదనుకున్నారేమో.... దేశరాజధానిలో కులాసాగా ఉన్నారు.

**- ఖాన్**






Printed & Published by Shri Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor Shri Pattan Hussain Khan. RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : info@rajadhanivartalu.com